తెలుగు దినపత్రిక

సాక్షర

చదువు..సమీక్షించు

RNI NO.APTEL/2011/42149



రూ.2016 కు పెంచి పేద ప్రజలకు ఆసరాగా నిలిచిన ఘనత కేసీఆర్‌దే

(బజార్‌హత్నూర్, సాక్షర): గత 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కేవలం రూ.200 పెన్షన్ అందించేదని, దాన్ని రూ.2016 కు పెంచి పేద ప్రజలకు ఆసరాగా నిలిచిన ఘనత కేసీఆర్ దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.మండల...

9వ పేజీ



ప్రతి అర్హత కుటుంబానికి జీవిత బీమా పథకం

(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హత గల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ మండల...

9వ పేజీ

ఆదిలాబాద్ | సంపుటి : 16 సంచిక : 288 ఆదివారం, నవంబర్ 22, 2026 ఎడిటర్: ఎ. లింగన్న | పేజీలు : 10 రూ. 2.00

భారత్‌ను చూసి నేర్చుకోండి..



అమెరికా: అమెరికా అధ్యక్షుడు తమ దేశ కేంద్ర బ్యాంకు అయిన ఫెడరల్ రిజర్వ్‌పై విమర్శలు గుప్పించారు. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండటంతో దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకం కలుగుతోందని ఆరోపించారు. ఇదే సమయంలో భారత్‌ను ఉదాహరణగా చూపిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో తక్కువ వడ్డీ రేట్లు ఉన్నాయని, ఏడు శాతం ఆర్థిక వృద్ధి నమోదవుతోందని ప్రశంసించారు. అమెరికా కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తే 15 నుంచి 20 శాతం వరకు జీడీపీ వృద్ధి సాధించవచ్చని వ్యాఖ్యానించారు వైట్‌హౌస్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ట్రంప్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సంస్థ రాజకీయ ప్రభావంతో పనిచేస్తోందని విమర్శించారు. పూర్తిగా 3 లో

డొనాల్డ్ ట్రంప్‌కు ఊరట..



ఇరాన్‌తో జరుగుతున్న సైనిక ఘర్షణల నుంచి అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆదేశిస్తూ రూపొందించిన 'వార్ పవర్స్' తీర్మానాన్ని యూఎస్ సెనేట్ తిరస్కరించింది. నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ యుద్ధ అంశంపై సెనేట్‌లో జరిగిన మొదటి ఓటింగ్ ఇదే కావడం గమనార్హం. ప్రతినిధుల సభ ఇప్పటికే ఆమోదించిన హెచ్.కాన్.రెస్ 93 తీర్మానంపై నిర్వహించిన ఓటింగ్‌లో అనుకూలంగా 48, వ్యతిరేకంగా 51 ఓట్లు రావడంతో ఇది వీగిపోయింది. ఈ తీర్మానానికి ముగ్గురు రిపబ్లికన్ సెనేటర్లు సుసాన్ కాలిన్స్, లిసా ముర్కోవ్స్కీ, రాండ్ పాల్ డెమొక్రాట్లకు అనుకూలంగా ఓటు వేయగా, డెమోక్రటిక్ పార్టీకి చెందిన జాన్ ఫెటర్‌మ్యాన్ దీనికి వ్యతిరేకంగా ఓటు వేశారు. పూర్తిగా 4 లో

కొండగట్టులో అపురూప ఘట్టం..



జగిత్యాల : జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అరుదైన చందనోత్సవం శుక్రవారం ముగిసింది. సుమారు 60 ఏళ్ల తర్వాత భక్తులకు స్వామివారి నిజరూప దర్శన భాగ్యం లభించింది. ఈ అపురూప ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. గత ఆరు దశాబ్దాలుగా స్వామివారి మూలవిరాట్టుపై పేరుకుపోయిన చందనం పొరను తొలగించే ప్రక్రియను ఆలయ అధికారులు, అర్చకులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నెల 15న ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం 18వ తేదీ సాయంత్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. పూర్తిగా 4 లో

శ్రీవారి ఆలయంలో వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం



తిరుమల : కైశిక ద్వాదశి పర్వదినం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ ఝామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్తిగా 4 లో

సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను..



ఖరగ్‌పూర్: సవాళ్లను ఎదుర్కోకుండా తాను జీవించలేనని, సంకుచిత భావజాలాన్ని వీడినప్పుడే వ్యక్తులతో పాటు దేశం పురోగమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని నిలబడటాన్ని నేర్చుకోకపోతే అనుకున్న ప్రగతిని ఎప్పటికీ సాధించలేమని యువతకు సూచించారు. దేశ ప్రగతిని అడ్డుకునే అతిపెద్ద అవరోధం మనసులోని పరిమితులేనని, గత కొన్నేళ్లుగా భారత్ ఆ అడ్డంకులను అధిగమించి ఎంతో ముందుకు సాగిందని స్పష్టం చేశారు. ఒకప్పుడు దేశంలో పేదరికాన్ని మార్చలేని శాపంగా భావించే వారని, భారత్ దాని నుంచి ఎప్పటికీ బయటపడలేదన్న అభిప్రాయం ఉండేదని ప్రధాని గుర్తుచేశారు. గతంలో ఎవరూ ఆ సమస్యను పరిష్కరించే సాహసం చేయలేదన్నారు. మిగతా 2 లో

తెలంగాణలో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ !



(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణపై చర్చలు ఊపందుకున్న వేళ, రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల్లో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ ఒక్కసారిగా కాకరేపుతోంది. రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బలహీన వర్గాలకు అధికారంలో సముచిత వాటా కల్పించాలంటూ ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, మంత్రులు ఏకంగా అగ్రనేత రాహుల్ గాంధీ వద్దే తమ గళాన్ని వినిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 15 మంది మంత్రులు ఉండగా, కేబినెట్‌లో ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ విస్తరణలోనే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు అదనంగా ఒక బీసీ నేతకు డిప్యూటీ సీఎం పీఠం కట్టబెట్టాలనే ప్రతిపాదన పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది.జనాభా ప్రాతిపదికన హక్కులు, అధికారం దక్కాలి .. 2 లో

2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్

(హైదరాబాద్, సాక్షర): భారత్‌కు అతిపెద్ద ఆస్తి యువతేనని, అయితే నేటి యువత డ్రగ్స్ బారిన పడుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీసత్యసాయి నిగమాగమంలో నిర్వహించిన 'సిటీ కన్వెన్షన్ ఆన్ డ్రగ్ ఫ్రీ ఇండియా' మెగా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా నగరంలో డ్రగ్స్ వ్యాప్తిపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.గతంలో పంజాబ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ పూర్తిగా నిర్వీర్యం చేసిందని గుర్తుచేసిన కిషన్‌రెడ్డి, ప్రస్తుతం హైదరాబాద్‌లోనూ డ్రగ్స్ చలామణి విచ్చలవిడిగా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు బానిసైన యువత మత్తులో తాము ఏం చేస్తున్నారో కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. 3 లో

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

(హైదరాబాద్, సాక్షర): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల సొంత పార్టీపై చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు."కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది" అని తెలిపారు. 4 లో

అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ల వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదల

(హైదరాబాద్, సాక్షర): అగ్రిగోల్డ్ డిపాజిటర్లకు సంబంధించిన బాండ్ పత్రాల వెరిఫికేషన్ ప్రక్రియకు తెలంగాణ సీఐడీ శాఖ డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, మండలాల వారీగా వెరిఫికేషన్ తేదీలు, కేంద్రాలు, వెరిఫికేషన్ నిర్వహించే అధికారుల వివరాలను ప్రకటించింది. అగ్రిగోల్డ్‌కు సంబంధించిన సుమారు రూ.447 కోట్ల కుంభకోణంలో ఇప్పటికే ముగ్గురు నిందితులను సీఐడీ అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.65 లక్షల మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. బాధితులకు సంబంధించిన డిపాజిట్ బాండ్ పత్రాలు, ఇతర ఆధారాల పరిశీలన కోసం ప్రత్యేకంగా వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపడుతోంది. 4 లో

సికింద్రాబాద్ టూ కరీంనగర్‌కు నమో భారత్

(కరీంనగర్, సాక్షర): ఉపాధి, విద్య, వ్యాపార అవసరాల కోసం హైదరాబాద్‌లో స్థిరపడిన ఉత్తర తెలంగాణ ప్రజలకు సొంతూళ్లకు రాకపోకలు పెద్ద సమస్యగా మారాయి. ముఖ్యంగా నగర తూర్పు ప్రాంతాలైన ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, బోడుప్పల్, తార్నాక తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజలు స్వస్థలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తే అధిక ఛార్జీలు, ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతుండగా.. రైళ్లలో వెళ్లాలంటే గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా కరీంనగర్‌కు నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలు ప్రవేశపెట్టాలనే డిమాండ్ పెరుగుతోంది. ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు సైతం ఈ ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారు. 4 లో

ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో భారీగా నియామకాలు



తెలంగాణలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. వర్సిటీలో మొత్తం 566 బోధనా సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో 48 ప్రొఫెసర్, 148 అసోసియేట్ ప్రొఫెసర్, 370 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. రాష్ట్రంలో కొత్తగా వ్యవసాయ కళాశాలల ఏర్పాటు, నూతన కోర్సుల ప్రవేశం, అత్యాధునిక పరిశోధనా కేంద్రాల ప్రారంభం వంటి కారణాలతో వర్సిటీలో అధ్యాపకుల అవశ్యకత పెరిగింది. ఈ నేపథ్యంలో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం, ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నియామక ప్రక్రియ పారదర్శకంగా సాగాలన్న ఉద్దేశంతో, కేవలం రాత పరీక్ష ఆధారంగానే ఈ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్వ్యూలను మినహాయించాలని వర్సిటీ పాలకమండలి ప్రభుత్వాన్ని కోరింది. అయితే, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిబంధనల ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించడం తప్పనిసరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంటర్వ్యూలు లేకుండా నియామకాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని ముఖ్యమంత్రి కార్యాలయం, ఆర్థిక శాఖ తేల్చిచెప్పాయి. ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించడంతో, విశ్వవిద్యాలయం త్వరలోనే అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి 4 సూటి ప్రశ్నలు..



కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లక్ష్యంగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 1962 నాటి యుద్ధ అవమానానికి కాంగ్రెస్ క్షమాపణ చెబుతుందా? అని ప్రశ్నిస్తూ శనివారం ఆయన నాలుగు సూటి ప్రశ్నలను సంధించారు. చైనాలో జరిగిన ఏపెక్ సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీపై ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రిజిజు మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించిన రిజిజు.. 1962 భారత్-చైనా యుద్ధంలో తమ గ్రామాన్ని చైనా ఆక్రమించిందని గుర్తుచేశారు. ఆ చారిత్రక అవమానానికి కాంగ్రెస్ ఎప్పుడు క్షమాపణ చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌ను ఎందుకు పేద దేశంగా ఉంచారో సమాధానం చెప్పాలన్నారు. మన దేశాన్ని 'పాములు ఆడించేవారి దేశం'గా ఎందుకు ప్రచారం చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను 'హిందూ రేట్ ఆఫ్ గ్రోత్' అంటూ ఎందుకు అవమానించారో కాంగ్రెస్ చెప్పాలని ప్రశ్నించారు. అంతకుముందు రాహుల్ గాంధీ స్పందిస్తూ, కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే ఆ అగ్రరాజ్యాల అధినేతల టేబుల్ వద్ద భారత ప్రధాని కూర్చుని ఉండేవారని వ్యాఖ్యానించారు. పూర్తిగా 4 లో

ఓవైసీ వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతల ఆందోళన

(సికింద్రాబాద్, సాక్షర): టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రసూల్ పురా కూడలి వద్ద కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. అసదుద్దీన్ ఓవైసీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రహదారిపై పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నిరసనకు దిగి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఉన్న ప్లకార్డులను కాల్చివేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ టీపీసీసీ ఉపాధ్యక్షురాలు గా ఉన్న కోట నీలిమ పట్ల అనుచితంగా మాట్లాడడం ఓవైసీకి తగదని అన్నారు. మహిళా నాయకురాలిపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 4 లో

సంపాదకీయం

అసంపూర్తి చరిత్రతో ఎ జర్నీ ఆఫ్ లవ్

ఒక వ్యక్తి ఆత్మకథ కేవలం వారి వ్యక్తిగత జ్ఞాపకాల సేకరణ కాదు. అది వారి అంతరాత్మకు అద్దం పట్టే పత్రం. కానీ, కొందరి జ్ఞాపకాలు సానుభూతి కోరుకునే నాటకాలుగా మారినప్పుడు, చరిత్ర వాటిని ప్రశ్నించక తప్పదు."భారత రాజకీయాల్లో అగ్రనాయకుల ఆత్మకథలు కేవలం వారి గతాన్ని నెమరువేసుకోవడానికి మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో కోల్పోయిన ప్రజాదరణను తిరిగి సంపాదించుకునే భావోద్వేగ అస్త్రాలుగా మారుతుంటాయి. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తాజాగా విడుదల చేసిన తన ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ అక్షరాలా ఇదే కోవకు చెందుతుంది. తన జీవితంలోని వ్యక్తిగత కష్టాలు, విషాదాలు, భావోద్వేగాలను ముందుపెట్టి దేశం మొత్తానికి తనను తాను ఒక నిస్సహాయ బాధితురాలిగా, త్యాగమూర్తిగా చిత్రీకరించుకునే ప్రయత్నం ఈ పుస్తకంలో అడుగడుగునా కనిపిస్తుంది. తన జీవిత ప్రయాణాన్ని భారతీయతకు ఆపాదించడం ద్వారా, సామాన్య ప్రజల కష్టాలతో తన రాజవంశపు అనుభవాలను ముడిపెట్టే ఒక కృత్రిమ ప్రయత్నం చేశారు. అయితే, క్షేత్రస్థాయి వాస్తవాల కోణంలో ఆలోచిస్తే— పూట గడవక కష్టపడే శ్రమజీవులు, నిత్యం కన్నీళ్లతో పోరాడే కోట్లాది సామాన్య కుటుంబాల జీవితాలకు, ఢిల్లీ అధికార కోటల్లో సర్వసౌకర్యాల మధ్య సాగిన గాంధీ కుటుంబపు ప్రయాణానికి అసలు పొంతన ఎక్కడుంది? ప్రతి కుటుంబం ఎదుర్కొనే సాధారణ కష్టాలను, త్యాగాలను తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ,అలాంటి కష్టాలు తాను పడినట్లుగాచెప్పుకుని మరోసారి సింపతీ కార్డ్ ప్రయోగించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న ఇక్కడ బలంగా ఉదయిస్తోంది. దశాబ్దాల పాటు దేశాన్ని, పార్టీని తమ గుప్పిట్లో పెట్టుకుని శాసించిన నాయకత్వం, నేడు రాజకీయంగా ఉనికి కోల్పోతున్న తరుణంలో ప్రజల సానుభూతిని ఓట్లుగా మలుచుకునేందుకే ఈ భావోద్వేగ నాటకానికి తెరలేపిందని చెప్పక తప్పదు. అంతకుమించి, ఈ 544 పేజీల పుస్తకం ద్వారా సోనియా గాంధీ కేవలం తన వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకోవడమే కాకుండా,కాంగ్రెస్ పార్టీ చరిత్రలో మాయని మచ్చలుగా మిగిలిపోయిన నిరంకుశ విధానాలను, అప్రజాస్వామిక కుటుంబ పాలనను,ప్రజాబలం లేని హైకమాండ్ సంస్కృతి ని సమర్థించుకునే ఒక విఫలయత్నం చేశారు. నాటి ఎమర్జెన్సీ వంటి చీకటి అధ్యాయాలను సైతం తప్పిదం అంటూనే ఇందిరా గాంధీని ప్రజాస్వామ్యవాదిగా వెనకేసుకురావడం, దశాబ్ద కాలం పాటు రాజ్యాంగేతర శక్తిగా తాను నడిపిన పాలనను గొప్ప సమన్వయంగా చిత్రీకరించుకోవడం ఇందుకు నిదర్శనం. చరిత్ర చేసిన తప్పులకు ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి, భావోద్వేగాల ముసుగులో ఆ నిరంకుశ పోకడలకు పవిత్రత ఆపాదించాలని చూడటం నేటి చైతన్యవంతమైన భారతీయ సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు!సోనియా గాంధీ తన ఆత్మకథలో మాజీ రాష్ట్రపతి, అత్యంత మేధావి, కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా సేవ చేసిన అనుభవజ్ఞుడు ప్రణబ్ ముఖర్జీ ప్రధాని పదవిని ఆశించినట్లుగా అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. ఇది కేవలం చరిత్రను వక్రీకరించడమే కాకుండా, పార్టీలో ప్రతిభను అణచివేసే గాంధీ కుటుంబ నైజాన్ని మరోసారి బయటపెట్టింది. నిజానికి, ప్రణబ్ ముఖర్జీ లాంటి ఉద్దండుడైన నాయకుడిని ప్రధాని పదవికి ఎంపిక చేస్తే, ఆయన పార్టీలో ఏకు మేకు అవుతారని.. తన ఆధిపత్యానికి, హైకమాండ్ కనుసన్నల్లో జరిగే రాజకీయాలకు గండి కొడతారనే భయంతోనే సోనియా ఆ పదవిని దక్కకుండా చేశారనేది అందరికీ తెలిసిన వాస్తవం. పార్టీపై కుటుంబ పట్టు సడలిపోతుందనే ఏకైక కారణంగానే దేశానికి సేవ చేసే అత్యున్నత అవకాశాన్ని ప్రణబ్ దాకా రానివ్వకుండా అడ్డుకున్నారు. నేడు అదే విషయాన్ని తన పుస్తకంలో తిరగేసి, ప్రణబ్ ముఖర్జీనే పదవి కోసం ఆరాటపడ్డారని రుద్దేయడం సోనియా రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. ఒక సీనియర్ నాయకుడిని రాజకీయ స్వార్థం కోసం ఎలా బలి చేశారనే దానికి ఈ ఆత్మకథే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది.దేశాన్ని దివాళా స్థితి నుంచి గట్టెక్కించి ఆధునిక భారతానికి ఆర్థిక పునాదులు వేసిన మహానాయకుడి పేరును తమ చరిత్ర పుటల నుంచి తుడిచేయగలరేమో కానీ.. కోట్లాది భారతీయుల హృదయాల నుంచి మాత్రం చెరపలేరు!. భారతదేశం అత్యంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, బంగారాన్ని తాకట్టు పెట్టాల్సిన దుస్థితిలో ఉన్న వేళ..సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించిన దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు. కేవలం దేశ ఆర్థిక వ్యవస్థనే కాకుండా, రాజీవ్ గాంధీ మరణానంతరం సంక్షోభంలో పడ్డ కాంగ్రెస్ పార్టీని సైతం సుదీర్ఘకాలం అధికారంలో నిలబెట్టడంలో పీవీ పాత్ర అనన్యసామాన్యం. కానీ, సోనియా గాంధీ ఆత్మకథలో పీవీ నరసింహారావు ప్రస్తావన కనీవినీ రీతిలో విస్మరించబడటం యాదృచ్ఛికం కాదు. గాంధీ కుటుంబ కనుసన్నల్లో కాకుండా, తన సొంత మేధస్సుతో, స్వయంకృషితో దేశాన్ని నడిపిన పీవీ అంటే సోనియా గాంధీకి మొదటి నుంచీ తీవ్రమైన విభేదాలు ఉండేవి. తమ కుటుంబం వెలుపల ఏ నేత కూడా పార్టీకి, దేశానికి గొప్ప నాయకత్వం వహించకూడదనే సంకుచిత మనస్తత్వమే నాటి విభేదాలకు అసలు కారణం. ఆ కక్ష , అసూయ ఎంత తీవ్రంగా ఉండేదంటే పీవీ జీవించి ఉన్నప్పుడే కాకుండా, ఆయన మరణించిన తర్వాత కూడా కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత అవమానకరంగా వ్యవహరించింది. 2004లో పీవీ కన్నుమూసినప్పుడు, దేశానికి ఐదేళ్ల పాటు ప్రధానిగా సేవలందించిన ఒక మహానాయకుడి పార్థివ దేహాన్ని కనీసం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం లోపలికి కూడా రానివ్వకుండా గేటు బయటే ఉంచి అవమానించిన చీకటి చరిత్ర సోనియా నాయకత్వానిది. ఢిల్లీలో ఆయన అంత్యక్రియలకు కనీసం స్థలం కేటాయించేందుకు కూడా మనసు రాని కఠిన వైఖరిని నాడు ప్రపంచం మొత్తం చూసింది. గాంధీ-నెహ్రూ కుటుంబానికి చెందని ఒక దక్షిణాది మేధావి దేశానికి ఆర్థిక విముక్తి కల్పించాడనే అక్కసుతో, ఆయన పేరును, కీర్తిని తొక్కేయడానికి నాడు అధికార పీఠంపై ఉండి అన్ని రకాల అవమానాలకు గురిచేశారు. ఇప్పుడు రెండు దశాబ్దాల తర్వాత కూడా ఆ ద్వేషం ఏమాత్రం తగ్గలేదని సోనియా తన ఆత్మకథ ద్వారా మరోసారి నిరూపించుకున్నారు. సొంత పార్టీ సీనియర్లు, పీవీ కుటుంబ సభ్యులు సైతం తప్పుబట్టే విధంగా, దేశ చరిత్రను మలుపుతిప్పిన పీవీ ప్రస్థానాన్ని తన పుస్తకంలో ఉద్దేశపూర్వకంగానే చెరిపివేయడం చరిత్రకు చేసిన ఘోర ద్రోహం. అప్పుడు పార్థివ దేహాన్ని పార్టీ ఆఫీసులోకి రానివ్వకుండా అవమానిస్తే, ఇప్పుడు అక్షరాల రూపంలోనూ ఆయన ఉనికి లేకుండా చేసి రెండోసారి అవమానించారు. తమ కుటుంబానికి భజన చేసేవారిని మాత్రమే ఆకాశానికెత్తుతూ, దేశం కోసం పనిచేసిన పీవీ లాంటి అసలైన దేశభక్తులను విస్మరించడం ద్వారా— కాంగ్రెస్ అంటే కేవలం ఒకే కుటుంబం, మిగతావారంతా అక్కడ కేవలం పనివారు మాత్రమేనన్నే కఠిన సత్యాన్ని సోనియా గాంధీ తన కలంతోనే లోకానికి చాటిచెప్పారు ఒకప్పుడు భావోద్వేగ ప్రసంగాలతో, కన్నీటి గాథలతో ప్రజలను ఆకర్షించిన రోజులు ఎప్పుడో గతించిపోయాయి. నేటి సమాజం ఈ మొసలి కన్నీళ్లను నమ్మే స్థితిలో ఏమాత్రం లేదు. దేశ ప్రజానీకం ఎప్పుడూ మోసపోరని, ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచిన చీకటి రోజులను, ఎమర్జెన్సీ నాటి అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు.అంతిమంగా ఒక్క విషయం స్పష్టం గాంధీ కుటుంబానికి ఈ దేశం ఏమాత్రం రుణపడి లేదు. ఈ దేశ సంపద కానీ,రాజ్యాధికారం కానీ ఏ ఒక్క కుటుంబానికో దఖలు పడిన వారసత్వ హక్కు అంతకన్నా కాదు. సార్వభౌమాధికారం కలిగిన ప్రజాస్వామ్యంలో ఎల్లప్పుడూ ప్రజలే సర్వోన్నతులు. పడిపోయిన తమ కుటుంబ కీర్తిని తిరిగి పునరుద్ధరించుకోవడానికి,వాస్తవాలను మరుగున పరిచి రాసుకున్న ఈ కట్టుకథల పుస్తకం బిలాంగింగ్ రేపటి చరిత్ర ముందు ఒక దోషిగా నిలబడక తప్పదు!

ఐఐటీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకలు..



- స్మారక నాణేన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ



(ఖరగ్‌పూర్, సాక్షర): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ ప్రత్యేక స్మారక నాణేన్ని మోదీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రొఫెసర్లతో ఆయన ముచ్చటించారు. భారతదేశ అభివృద్ధికి ఐఐటీ ఖరగ్‌పూర్ అందించిన సహకారాన్ని వారికి వివరించారు. గడిచిన ఏడున్నర దశాబ్దాల్లో దేశం అనేక రంగాల్లో గణనీయమైన మార్పులను చూసిందని, ఈ ప్రయాణంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించిందని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 1951లో ప్రారంభమైన ఐఐటీ ఖరగ్‌పూర్ దేశంలోనే తొలి ఐఐటీగా పేరుగాంచిందని అన్నారు. సాంకేతిక విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు మార్గదర్శకంగా నిలిచిందని ప్రశంసించారు. తొలినాళ్లలో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన ఇంజనీర్లను అందించిందని.. ఆ తర్వాత అంతరిక్ష పరిశోధనలు, అణుశక్తి రంగాల్లోనూ దేశానికి సేవలందించిన ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని కొనియాడారు. సమాచార సాంకేతిక రంగం విస్తరించిన తర్వాత సాఫ్ట్‌వేర్ పరిశ్రమ అభివృద్ధిలోనూ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని ప్రశంసల జల్లు కురిపించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ కంపెనీలకు నాయకత్వం వహించే వరకూ ఐఐటీ పూర్వ విద్యార్థులు ఎదిగారని కొనియాడారు. మరోవైపు, ఐఐటీ ఖరగ్‌పూర్ ఉన్న ప్రదేశానికి స్వాతంత్ర్య పోరాటంతోనూ సంబంధం ఉందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. బ్రిటిష్ పాలనలో ఈ ప్రాంతం స్వాతంత్ర్య సమరయోధులను నిర్బంధించిన శిబిరంగా ఉండేదని పేర్కొన్నారు. ఒకప్పుడు స్వాతంత్ర్యం కోసం కలలు కన్న ఈ నేల.. ఇప్పుడు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే వేదికగా మారిందన్నారు. ఈ సందర్భంగా పరిమితులను అధిగమించి, అవకాశాలను ఆవిష్కరించాలని విద్యార్థులకు ప్రధాని పిలుపునిచ్చారు. చాలామంది తమ కలలు, సామర్థ్యాలు, లక్ష్యాలకు హద్దులు విధించుకుంటారని.. ఇలాంటి పరిమిత ఆలోచనలను విడిచిపెట్టి కొత్త అవకాశాలను అన్వేషించాలని సూచించారు. 'బ్రేక్ ద లిమిట్.. అన్‌లాక్ ద పాసిబిలిటీస్' అంటూ మోదీ పేర్కొన్నారు. ఆలోచనా పరిధిని విస్తరించుకున్నప్పుడే వ్యక్తులు, దేశం తమ అసలైన సామర్థ్యాన్ని గుర్తించగలవని ప్రధాని మోదీ చెప్పారు. కాలానికి అనుగుణంగా ఐఐటీ ఖరగ్‌పూర్ ఇంజనీరింగ్, పరిశోధన రంగాల్లో తన పాత్రను కొనసాగిస్తోందని, విద్యార్థులు కూడా తమ ప్రతిభను దేశ భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

మొదటి పేజీ తరువాయి

సవాళ్లు ఎదుర్కోకుండా నేను బతకలేను..

కానీ తాము అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. ఫలితంగా దేశంలో దాదాపు 50 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక స్వయంగా ధ్రువీకరించిందని తెలిపారు. గత 75 ఏళ్ల కాలంలో భారత్ ఎడ్లబండ్ల స్థాయి నుంచి బుల్లెట్ రైళ్ల దిశగా వేగంగా ఎదిగిందని, ఈ చారిత్రక మార్పులకు ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రత్యక్ష సాక్షిగా నిలిచిందని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధన రంగంలోనూ సరికొత్త మార్పులు తెచ్చామని మోదీ వివరించారు. గతంలో ఇస్రోలోకి ప్రతిభావంతులైన యువత ప్రవేశంపై అనేక ఆంక్షలు ఉండేవని, వాటిని తొలగించి అర్హులైన యువ నిపుణులకు తలుపులు తెరిచామని వెల్లడించారు. అందుకే నేడు భారత అంతరిక్ష విజయాలను ప్రపంచం మొత్తం గుర్తిస్తోందన్నారు. సెమీకండక్టర్ల రంగంలో ఐదు దశాబ్దాల క్రితం అవకాశాన్ని చేజార్చుకున్నప్పటికీ, తాము పట్టుదలతో నాలుగేళ్లలోనే భారీ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించనుందని, విద్యార్థులు 'దేశమే ప్రథమం' అనే నినాదంతో సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి ఎమ్మెల్యే గంగుల కమలాకర్



(కరీంనగర్, సాక్షర): కరీంనగర్ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదేశించారు. కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి ధాన్యం విక్రయించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ ఎలా సాగుతున్నది, ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రావొద్దని సూచించారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ చిన్ననాటి ఇటలీ ఇల్లు ఇప్పుడు సిక్కు వ్యక్తి చేతిలో.. మ్యూజియంగా మార్చాలని కోరిక



- ఇటలీలోని లూసియానాలో ఉన్న ఆరు గదుల రాతి భవనం
- 1946 డిసెంబర్ 9న అక్కడే జన్మించిన సోనియా గాంధీ
- 2020లో ఆ ఇంటిని కొనుగోలు చేసిన వ్యాపారవేత్త సుఖ్‌దేవ్ సింగ్ కాంగ్
- ఇంటికి 'ఇండియన్ హౌస్'గా పేరు, మువ్వన్నెల జెండా ఏర్పాటు
- మ్యూజియం కోసం గాంధీ కుటుంబం నుంచి జ్ఞాపికల సేకరణకు యోచన

ఇటలీ: ఇటలీలో, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ చిన్ననాటి ఇంటిని మ్యూజియంగా మార్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇటలీలో స్థిరపడిన సిక్కు వ్యాపారవేత్త సుఖ్‌దేవ్ సింగ్ కాంగ్ ఈ సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ఆరేళ్ల క్రితమే ఆయన ఈ ఇంటిని కొనుగోలు చేశారు. మ్యూజియంలో ప్రదర్శించేందుకు అవసరమైన వ్యక్తిగత వస్తువులు, పాత జ్ఞాపకాలను సేకరించేందుకు త్వరలోనే గాంధీ కుటుంబాన్ని కలవాలని ఆయన భావిస్తున్నారు. ఇటలీలోని విసెంజా ప్రావిన్స్‌కు చెందిన లూసియానా గ్రామంలో ఈ ఇల్లు ఉంది. బూడిద రంగు రాళ్లు, కాంక్రీట్‌తో నిర్మించిన ఈ భవనంలో మొత్తం ఆరు గదులు ఉన్నాయి. సోనియా గాంధీ 1946 డిసెంబర్ 9న ఇక్కడే జన్మించారని, చిన్ననాటి రోజులను అక్కడే గడిపారని 52 ఏళ్ల కాంగ్ తెలిపారు. ప్రస్తుతం దీనికి 'ఇండియన్ హౌస్' అని పేరు పెట్టారు. ఇంటిపై మువ్వన్నెల జెండాతో పాటు, బయట 'సోనియా గాంధీ జన్మస్థలం' అని రాసి ఉన్న నేమ్‌ప్లేట్‌ను కూడా ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఎవరైనా చూడటానికి వస్తే సహాయం చేసేందుకు అక్కడ ఒక కేర్‌టేకర్‌ను సైతం నియమించారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ నుంచి 1992లో ఇటలీకి వలస వెళ్లిన కాంగ్, డైరీ ఫామ్‌లు, వ్యవసాయం, ఫ్యాక్టరీల్లో పనిచేసి వ్యాపారవేత్తగా ఎదిగారు. 2020లో తన భార్య, కుమార్తె పేర్ల మీద ఈ ఇంటిని కొనుగోలు చేశారు. ఆస్తి పన్నులతో కలిపి ఏటా దాదాపు 1,000 యూరోలను దీని నిర్వహణ కోసం ఖర్చు చేస్తున్నారు. గతంలో ఈ ఇంటిని అద్దెకు ఇవ్వాలని, లేదా గురుద్వారాగా మార్చాలంటూ పలు ఆఫర్లు వచ్చినా ఆయన కుటుంబం తిరస్కరించింది. సోనియా గాంధీ, ఆమె పుట్టింటి కుటుంబమైన 'మైనో' చారిత్రక జ్ఞాపకాలను పదిలంగా కాపాడటమే తమ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాచీన నివాసాన్ని అత్యాధునిక మ్యూజియంగా తీర్చిదిద్దితే విదేశాల్లోని భారతీయులతో పాటు స్థానిక పర్యాటకులు భారీగా తరలివస్తారని కాంగ్ భావిస్తున్నారు. తద్వారా ఆ గ్రామీణ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు సైతం మేలు జరుగుతుందని చెప్పారు. త్వరలోనే సోనియా గాంధీతో పాటు ఆమె పిల్లలు రాహుల్, ప్రియాంకలను కలిసి ఫొటోలు, పత్రాలు, ఇతర జ్ఞాపికలను సేకరించాలని అనుకుంటున్నారు. సోనియా గాంధీ రాసిన తాజా జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైన తర్వాత ఆమె చిన్ననాటి ఇటలీ జీవితంపై మళ్లీ అందరిలోనూ అమితమైన ఆసక్తి నెలకొంది.

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ !

అంటూ దేశవ్యాప్తంగా కులగణన, సామాజిక న్యాయం నినాదాన్ని భుజానికెత్తుకున్న రాహుల్ గాంధీకి ఇప్పుడు సొంత రాష్ట్రం తెలంగాణలోనే అసలైన పరీక్ష ఎదురైంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో బీసీ ఓటర్ల పాత్ర అత్యంత కీలకమైనప్పటికీ, కేబినెట్‌లో ఆ సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కలేదనే అసంతృప్తి మొదటి నుంచీ ఉంది. ఇటీవలే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రి ఉంటారంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఇప్పుడు ఏకంగా బీసీ డిప్యూటీ సీఎం పదవి కోసం నేతలు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తుండటంతో, రాహుల్ గాంధీ తన సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ఇక్కడ ఎంతవరకు అమలు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.అయితే, బీసీ నేతకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడానికి పార్టీలోని సీనియర్ నేతలు, అగ్రవర్ణ వర్గాలు అంత సులభంగా అంగీకరిస్తాయా అన్నదే అసలు ప్రశ్న. ఇప్పటికే కేబినెట్‌లోని రెండు ఖాళీల కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి,ప్రేమ్‌సాగర్ రావు వంటి సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, ఇప్పటికే ఒక డిప్యూటీ సీఎం పదవి ఎస్సీ సామాజిక వర్గం వద్ద ఉండగా, మరో డిప్యూటీ సీఎం పదవిని సృష్టిస్తే అధికార కేంద్రాలు పెరిగి పరిపాలనలో సమన్వయ లోపం తలెత్తుతుందని సీనియర్లలోని ఒక వర్గం వాదిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేబినెట్ కూర్పులో సామాజిక సమతుల్యతతో పాటు, పార్టీలో తన పట్టు సడలకుండా జాగ్రత్త పడాల్సిన సున్నితమైన పరిస్థితి నెలకొంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం మాత్రమే ఉన్నందున , డిసెంబర్‌లో జరగనున్నట్లు భావిస్తున్న కేబినెట్ విస్తరణ కాంగ్రెస్ భవిష్యత్తుకు అత్యంత కీలకం కానుంది. ఒకవేళ అధిష్టానం బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్‌ను పక్కనపెడితే,రాష్ట్రంలోని మెజారిటీ ఓటు బ్యాంకు అయిన బలహీన వర్గాలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్,బీజేపీలు ఇదే అంశాన్ని ఆయుధంగా చేసుకుని కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అలాగని డిప్యూటీ సీఎం పదవి ఇస్తే,ఆ పదవి కోసం పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లేదా ఇతర సీనియర్ బీసీ నేతల మధ్య పోటీ నెలకొని అంతర్గత కుమ్ములాటలు బయటపడే ఛాన్స్ ఉంది.మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో 'బీసీ డిప్యూటీ సీఎం' అంశం ఇప్పుడు అధిష్టానానికి కత్తిమీద సాములా మారింది.కేవలం నినాదాలు, హామీలతోనే సరిపెట్టకుండా 56 శాతం జనాభా ఉన్న బీసీలకు అత్యున్నత పదవి ఇచ్చి రాహుల్ గాంధీ చరిత్ర సృష్టిస్తారా, లేక సీనియర్ల ఒత్తిడికి తలొగ్గి పాత ఫార్ములాతోనే సర్దుబాటు చేస్తారా అన్నది వేచి చూడాలి.

ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

- కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందన్న కేటీఆర్
- తెలంగాణలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గాయని విమర్శ
- ఆర్బీఐ నివేదిక ప్రకారం పంచాయతీ సగటు వ్యయం రూ.6.24 లక్షలకు పడిపోయిందని వెల్లడి

(హైదరాబాద్, సాక్షర): కేసీఆర్ హయాంలో అభివృద్ధి బాటలో సాగిన తెలంగాణ గ్రామాలు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గిపోయాయని పేర్కొంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్స్టిట్యూషన్స్' నివేదికను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఈ వివరాలను వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు సగటున ఒక్కొక్కటి రూ.16.59 లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 2024-25 నాటికి ఆ మొత్తం రూ.6.24 లక్షలకు పడిపోయిందని ఆయన తెలిపారు. ప్రజలు కట్టిన పన్నులు, ప్రభుత్వం తెస్తున్న అప్పులు అభివృద్ధి పనులకు చేరడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో పల్లె నుంచి పట్నం వరకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, జరుగుతున్నదంతా విధ్వంసమేనని కేటీఆర్ పేర్కొన్నారు.

న్యాయ దిగ్గజం రామ్ జెఠ్మలానీ విగ్రహావిష్కరణ

- భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వర్చువల్ ఆవిష్కరణ



(కరీంనగర్, సాక్షర): సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల విశిష్ట భాగస్వామ్యం. భారత న్యాయరంగంలో తన అసాధారణ ప్రతిభ, న్యాయపరిజ్ఞానం, వాదనా పటిమతో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న ప్రముఖ సీనియర్ న్యాయవాది, మాజీ కేంద్ర మంత్రి, భారత బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ దివంగత రామ్ జెఠ్మలానీకి కరీంనగర్‌లో ఘన నివాళి అర్పించారు. ఆయన న్యాయరంగానికి అందించిన అమూల్యమైన సేవలకు గుర్తుగా కరీంనగర్‌లోని జస్టిస్ కుమారయ్య కాలేజ్ ఆఫ్ లా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని శనివారం భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వర్చువల్ విధానంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పుల్లిచెర్ల సామ్ కోషి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ పాల్గొన్నారు. రామ్ జెఠ్మలానీ కుమారుడు, రాజ్యసభ సభ్యుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జెఠ్మలానీ, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు స్వామినాథన్ గురుమూర్తి తదితర ప్రముఖుల హాజరుతో కార్యక్రమం విశిష్టతను సంతరించుకుంది. దేశ అత్యున్నత న్యాయస్థానం, తెలంగాణ హైకోర్టుకు చెందిన ఉన్నత న్యాయమూర్తులు ఒకే వేదికపై భాగస్వాములు కావడం ఈ వేడుకకు ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకువచ్చింది. న్యాయవాద వృత్తిలో అసాధారణ ప్రతిభ కనబరిచిన రామ్ జెఠ్మలానీ తన సుదీర్ఘ ప్రస్థానంలో దేశవ్యాప్తంగా అనేక సంచలనాత్మక, కీలక న్యాయపరమైన కేసుల్లో వాదనలు వినిపించారు. న్యాయవాదిగా మాత్రమే కాకుండా ప్రజాప్రతినిధిగా, కేంద్ర మంత్రిగా, భారత బార్ కౌన్సిల్ చైర్మన్‌గా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ దేశానికి విశేష సేవలందించారు. న్యాయం పట్ల ఆయనకున్న నిబద్ధత, నిర్భయమైన వైఖరి, రాజ్యాంగ విలువల పట్ల గౌరవం, న్యాయవాద వృత్తిలో చూపిన అంకితభావం భారత న్యాయరంగ చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందాయి. అటువంటి న్యాయరంగ మహనీయుడి విగ్రహాన్ని న్యాయ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసి, భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా వర్చువల్‌గా ఆవిష్కరించడం కరీంనగర్ న్యాయ విద్యారంగానికి గర్వకారణం.

తల్లి సావిత్రీ దేవికి కన్నీటి వీడ్కోలు



- ఉత్తరాఖండ్‌లోని పంచూర్ గ్రామంలో తల్లి పాడె మోసిన సీఎం
- 91 ఏళ్ల వయసులో శుక్రవారం కన్నుమూసిన సావిత్రీ దేవి
- అమ్మను మించిన రక్షణ, ప్రేమ లేవంటూ యోగి భావోద్వేగ పోస్ట్
- హరిద్వార్‌లోని చండీ ఘాట్‌లో అంత్యక్రియలు

ఉత్తరాఖండ్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన తల్లి సావిత్రీ దేవి అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఉత్తరాఖండ్‌లోని పౌరీ గఢ్వాల్ జిల్లా పంచూర్ గ్రామంలోని తమ పూర్వీకుల నివాసంలో శనివారం ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. అమ్మ ప్రేమతో సమానమైనది ఈ సృష్టిలో ఏదీ లేదంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తల్లి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించిన సీఎం యోగి, స్వయంగా పాడే మోశారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ.. తల్లిని మించిన నీడ, ఆశ్రయం, రక్షణ, ప్రేమ మరేదీ లేదని పేర్కొన్నారు. 91 ఏళ్ల సావిత్రీ దేవి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో స్వగ్రామంలో కన్నుమూశారు. ఆ సమయంలో లక్నోలో అధికారిక కార్యక్రమంలో ఉన్న సీఎం యోగి, విషాదాన్ని దిగమింగుకుని షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేసుకున్నారు. అనంతరం ఉత్తరాఖండ్‌లోని స్వగ్రామానికి చేరుకుని కడసారి వీడ్కోలు పలికారు.

గ్రాడ్యుయేట్లతో మమేకమైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి..



(హనుమకొండ, సాక్షర): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గారితో కలిసి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు శనివారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం, జేఎన్ఎస్ మైదానం, పబ్లిక్ గార్డెన్‌లలో వాకర్స్‌తో ఆత్మీయ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం వాకింగ్‌కు వచ్చిన వారిని కలుసుకుంటూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వాకర్స్‌తో కలివిడిగా మాట్లాడుతూ వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తూ, వారి గొంతుకగా నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గారికి తమ మద్దతు తెలియజేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

గుండెపోటు సంకేతాలను నిర్లక్ష్యం చేయొద్దు..!

- ఛాతినొప్పి వస్తే గ్యాస్ అనుకుని తేలిగ్గా తీసుకోవద్దు
- సకాలంలో వైద్యం అందితే ప్రాణరక్షణ
- సిరిసిల్ల పోలీసు సిబ్బందికి మెగా హెల్త్‌టాక్





రాజన్న సిరిసిల్ల: గుండెపోటు లక్షణాలను ముందుగానే గుర్తించి అప్రమత్తమైతే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.సతీశ్‌కుమార్ సూచించారు. ఛాతినొప్పి వచ్చినప్పుడు గ్యాస్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని, గుండెపోటు అనుమానం కలిగితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలని తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి మెగా హెల్త్‌టాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ... గుండెపోటు రావడానికి ప్రధాన కారణాలు, ముప్పు ఎక్కువగా ఉండే పరిస్థితులు, ముందుగా కనిపించే హెచ్చరిక సంకేతాలను వివరించారు. ఛాతిలో నొప్పి, బిగుతుగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక చెమటలు, ఎడమ చేయి లేదా దవడకు నొప్పి వ్యాపించడం వంటి లక్షణాలను గుర్తించాలని సూచించారు. ప్రతి ఛాతినొప్పిని గ్యాస్ సమస్యగా భావించకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా బీపీ, మధుమేహం, కొలెస్ట్రాల్ ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు ఇంటి చిట్కాలు పాటిస్తూ, తెలిసినవారికి ఫోన్లు చేస్తూ సమయాన్ని వృథా చేయకుండా వెంటనే అత్యవసర వైద్యం అందించాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, సమతుల ఆహారం తీసుకోవడం, ఆహార నియమాలు పాటించడం, వ్యాయామం చేయడం, పొగతాగడం మానేయడం ద్వారా గుండెజబ్బుల ముప్పును తగ్గించుకోవచ్చని వివరించారు. పోలీసు విధుల్లో నిరంతరం ఒత్తిడికి గురయ్యే సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే, ఆర్ఐ సురేష్ మోడెం, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, కొత్తపల్లి శ్రీనివాస్, విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ, షా, ఒవైసీది ఒకటే జట్టు

- అసదుద్దీన్‌పై తొలిసారి రేవంత్ ఫైర్
- మోదీ, షా, ఒవైసీ కలిసి మత రాజకీయాలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి
- దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేసి గెలవాలని అమిత్ షాకు సవాల్
- తెలంగాణలో బీజేపీకి బలం లేదన్న రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే అసలు ప్రత్యర్థని స్పష్టీకరణ
- లోక్‌సభ స్థానాల పెంపుతో దక్షిణాది ప్రాధాన్యం తగ్గుతుందని ఆందోళన

హైదరాబాద్ : ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు ఒవైసీ కూడా మత రాజకీయాలు చేస్తూ పరస్పరం రాజకీయ లబ్ధి పొందుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురి రాజకీయ వైరుధ్యం కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని పేర్కొన్నారు. మోదీ, అమిత్ షా ఒకవైపు హిందువులను, మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలను ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ మతపరమైన చీలిక ద్వారా మూడు పార్టీలూ ప్రయోజనం పొందుతున్నాయని రేవంత్ విశ్లేషించారు. 70 ఏళ్లుగా కాంగ్రెస్ మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలు చేసిందన్న బీజేపీ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తమ పార్టీ మతం, కులంతో సంబంధం లేకుండా సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ నేత ఆజం ఖాన్ చేసిన 'హైదరాబాదీ బిర్యానీ' వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఒవైసీ రాజకీయాలు ఒక ప్రాంతానికే పరిమితమని పరోక్షంగా ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మాత్రమే ప్రధాన ప్రత్యర్థి అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోయిన విషయాన్ని గుర్తుచేశారు. "నిజంగా ధైర్యం ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి అసదుద్దీన్ ఒవైసీని ఓడించాలి" అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పైనా రేవంత్ తన విమర్శల దాడిని కొనసాగించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను 'రావణాసురుడు'గా, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నేతగా అభివర్ణించారు. అదే సమయంలో, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

మొదటి పేజీ తరువాయి

భారత్‌ను చూసి నేర్చుకోండి..

ఆర్థిక గణాంకాలు మెరుగ్గా ఉన్న సమయంలో వడ్డీ రేట్లను తగ్గించాల్సింది పోయి పెంచడం ఏమిటని ప్రశ్నించారు. దేశ ఆర్థిక పరిస్థితి బలంగా ఉన్నప్పుడు అప్పులు తీసుకునేవారికి ఖర్చు తగ్గించాలని, కానీ అమెరికా కేంద్ర బ్యాంకు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతోందని అన్నారు భారత్‌లో తక్కువ వడ్డీ రేట్లు ఉన్నప్పటికీ ఏడు శాతం స్థాయిలో జీడీపీ వృద్ధి నమోదవుతోందని ప్రశంసించారు . భారత్‌ను చూడాలని, అక్కడి ఆర్థిక వృద్ధిని గమనించాలని అమెరికా విధాన నిర్ణేతలకు సూచించారు. అమెరికా ప్రపంచంలోనే అత్యల్ప వడ్డీ రేట్లు కలిగిన దేశంగా ఉండాలని అన్నారు. ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలు విజయవంతం కావడానికి అమెరికా కీలక పాత్ర పోషిస్తోందని, అలాంటి అమెరికాకే అత్యల్ప వడ్డీ రేట్లు ఉండాలని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గిస్తే 14 నుంచి 20 శాతం వరకు ఆర్థిక వృద్ధి సాధించవచ్చని ఆయన అన్నారు. ప్రస్తుతం అమెరికాలో సుమారు నాలుగు శాతం వృద్ధి నమోదవుతోంది.

మొదటి పేజీ తరువాయి

2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్

నగరంలోని మూతపడ్డ కంపెనీలను అడ్డాలుగా చేసుకుని డ్రగ్స్ తయారు చేస్తున్నారని, అంతేకాకుండా పలుచోట్ల ఇళ్ల టెర్రాస్‌లపై కూడా గంజాయి మొక్కలను పెంచుతున్నారని సంచలన విషయాలు వెల్లడించారు.యువతను ఈ మత్తు మహమ్మారి నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులు, యువత, మేధావులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ముందుకొచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. 2029 నాటికి భారతదేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. డ్రగ్స్ కేసులపై శ్వేతపత్రం మహేశ్వర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతను మత్తుకు బానిసలుగా మార్చి మన దేశాన్ని నాశనం చేయాలని ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. 'నషా ముక్త్ భారత్' సంకల్పం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్ని డ్రగ్స్ కేసులు నమోదు చేసింది? ఎంతమందిని అరెస్ట్ చేసింది? అనే వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని వెంటనే విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి సికింద్రాబాద్ టూ కరీంనగర్‌కు నమో భారత్

ఈ మార్గంలో వేగవంతమైన రైలు సేవలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్‌లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రయాణ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం హైదరాబాద్-కరీంనగర్ మధ్య ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ప్రధాన రవాణా సాధనంగా ఉన్నాయి. ప్రతి ఐదు నిమిషాలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రయాణానికి సుమారు నాలుగు గంటలు పడుతోంది. కనీస టికెట్ ధర రూ.220 నుంచి ప్రారంభమవుతుండగా.. లగ్జరీ బస్సుల్లో ఛార్జీలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. పండగలు, వారాంతాల్లో ప్రయాణికుల రద్దీ పెరిగితే బస్సుల్లో సీట్లు దొరకడం కూడా కష్టంగా మారుతోంది. మరోవైపు రైలు ప్రయాణం చౌకగా ఉన్నప్పటికీ ప్రస్తుతం కరీంనగర్ నుంచి కాచిగూడకు నడుస్తున్న డెమూ ప్యాసింజర్ రైలు ప్రయాణికులకు పెద్దగా ఉపయోగపడటం లేదు. ఈ రైలు జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్ మీదుగా సుమారు 309 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్తోంది. దీంతో గమ్యస్థానానికి చేరుకోవడానికి ఎనిమిది నుంచి తొమ్మిది గంటలు పడుతోంది. నిజామాబాద్-మేడ్చల్ మార్గంలో సింగిల్ రైల్వే లైన్ ఉండటం, గరిష్ఠ వేగపరిమితి గంటకు 110 కిలోమీటర్లుగా ఉండటం వల్ల ప్రయాణ సమయం మరింత పెరుగుతోంది. బస్సులో నాలుగు గంటల్లో చేరుకునే దూరానికి రైలులో దాదాపు రెట్టింపు సమయం వెచ్చించాల్సి వస్తోంది.కరీంనగర్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు రైలు నడిపేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్దపల్లి-కాజీపేట మధ్య మూడో రైల్వే లైన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. కాజీపేట నుంచి ఘట్‌కేసర్ వరకు రెండో లైన్, ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ వరకు నాలుగో రైల్వే మార్గం అందుబాటులో ఉన్నాయి. పెద్దపల్లి నుంచి సికింద్రాబాద్ వరకు రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉంది. కరీంనగర్-పెద్దపల్లి మధ్య ఉన్న 35 కిలోమీటర్ల సింగిల్ లైన్‌లోనూ గంటకు 110 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపే అవకాశం ఉందని ప్రతిపాదకులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలును ప్రవేశపెడితే సికింద్రాబాద్-కరీంనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని మూడు నుంచి మూడున్నర గంటల నుంచి నాలుగు గంటలలోపు పరిమితం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.కొత్త రైలు అందుబాటులోకి వస్తే సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు బస్సులతో పోలిస్తే చౌకైన ప్రయాణ సదుపాయం లభిస్తుంది. ముఖ్యంగా ఉప్పల్, ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు తమ నివాస ప్రాంతాలకు సమీపంలోని స్టేషన్ల నుంచే రైలు ఎక్కే అవకాశం ఉంటుంది. దీనివల్ల నగరంలోని రద్దీ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు రోడ్డు ప్రయాణంపై ఆధారపడటం కూడా తగ్గుతుంది. కరీంనగర్, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్ మధ్య విద్యా, ఉద్యోగ, వ్యాపార సంబంధాలు మరింత బలోపేతమవుతాయి. హైదరాబాద్‌లో పనిచేస్తూ స్వగ్రామాలకు తరచూ వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు ఈ రైలు సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఇప్పటికే రైల్వే మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రైల్వే శాఖ నమో భారత్ లేదా మెము రైలు ప్రతిపాదనను పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

విద్యార్థుల హాజరు శాతం పెరగాలి



- టీచర్లు నిత్యం పర్యవేక్షణ చేయాలి
- విద్యాలయాలకు వచ్చేలా ప్రోత్సహించాలి
- విద్యాలయాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- పేరెంట్ టీచర్ మీటింగ్ లు క్రమం తప్పకుండా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ సమీక్ష

(రాజన్న సిరిసిల్ల, సాక్షర): నవంబర్ 21 :జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎఫ్ ఆర్ ఎస్, ఎఫ్ ఎల్ ఎన్, ఆన్లైన్ తరగతులు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.. విద్యాశాఖ, పంచాయతీ రాజ్ శాఖ, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా టీచర్లు, విద్యాధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అన్ని విద్యాలయాల విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. బడికి హాజరు కాకపోవడానికి కారణాలు తెలుసుకోవాలని, నిత్యం వచ్చేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బంది ఉంటే పరిష్కరించాలని స్పష్టం చేశారు. పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం నిర్మాణ పనులు పనుల్లో మరింత వేగం పెంచాలని ఆదేశించారు. పనులకు అనుగుణంగా కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులను మొదలుపెట్టాలని తెలిపారు. నాబార్డ్ నిధులతో విద్యాలయాల్లో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం ఉష కింద గంభీరావుపేట, అగ్రహారంలో నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని, వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ఆన్లైన్ తరగతులను అన్ని విద్యాలయాలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తప్పనిసరిగా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రోజువారి, వారవారం పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆన్లైన్ తరగతులను వినియోగించు కోవాలని పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా నిర్వహించాలి పేరెంట్ టీచర్ మీటింగ్లో అన్ని విద్యాలయాల్లో క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని మీటింగ్లకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పర్చాలి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మెరుగు పర్చాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థులు చదవడం, రాయడం, గణితం ఇతర పాఠ్యాంశాలు రాసి.. చదివేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులను రానున్న వార్షిక పరీక్షలకు ఒక ప్రణాళిక ప్రకారం ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని ఆదేశించారు. గత ప్రశ్నాపత్రాలు సాధన చేయించాలని సూచించారు. అన్ని పాఠ్యాంశాలు చదివి రాసేలా సాధన చేయించాలని స్పష్టం చేశారు. అన్ని విద్యాలయాల బాధ్యులు పకడ్బందీ ప్రణాళిక అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా విద్యాధికారి అన్ని అంశాలపై తరచూ సమీక్షలు నిర్వహించాలని పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి విద్యా అధికారులు తమ పరిధిలోని అన్ని విద్యాలయాల్లో తరచూ తనిఖీలు చేయాలని సూచించారు సమావేశంలో జిల్లా విద్యాధికారి విజయ సాగర్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్ 'మెటా' కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తల విధ్వంసం..





- మండిపడ్డ బీజేపీ, బీఆర్ఎస్

(హైదరాబాద్, సాక్షర): తమ జాతీయ నాయకుల సోషల్ మీడియా ఖాతాలపై ఆంక్షలు విధించడాన్ని నిరసిస్తూ తెలంగాణ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిన్న హైదరాబాద్ రాయదుర్గంలోని మెటా కార్యాలయం ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి నేతృత్వంలో దాదాపు 25 మంది కార్యకర్తలు స్కైవ్యూ భవనంలోకి ప్రవేశించి కేంద్ర ప్రభుత్వం, మెటా సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కారిడార్‌లోని పూలకుండీలను కొందరు కార్యకర్తలు ధ్వంసం చేశారు. భారత యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్, జాతీయ ఇన్‌ఛార్జ్ మనీష్ శర్మల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను నిలిపివేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని యూత్ కాంగ్రెస్ ఆరోపించింది. ఖాతాలపై ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని, లేకుంటే ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ఏడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఇదే అంశంపై ముంబైలోని మెటా కార్యాలయం వెలుపల కూడా ఆ పార్టీ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సుమారు 21 మంది నిరసనకారులను ముందస్తు జాగ్రత్తగా అదుపులోకి తీసుకుని, అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. నిరసనకారులు ప్రధాన కార్యాలయంలోకి ప్రవేశించలేదని, సంస్థ నుంచి ఎటువంటి అధికారిక ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. యూత్ కాంగ్రెస్ తీరుపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో స్పందించారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రైవేట్ సంస్థల కార్యాలయాలపై దాడులు చేస్తూ గూండాయిజానికి పాల్పడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ... ఎన్నో ఏళ్లుగా కష్టపడి నిర్మించిన 'బ్రాండ్ హైదరాబాద్' నమ్మకాన్ని ఇలాంటి చర్యలు దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు రాజకీయాలకు దూరంగా వ్యాపారం చేసుకోవాలని, ప్రభుత్వం కూడా వాటిపై అనవసర ఒత్తిడి తీసుకురాకూడదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. కాగా, ఈ ఆరోపణలు, పరిణామాలపై మెటా సంస్థ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

మొదటి పేజీ తరువాయి కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి 4 సూటి ప్రశ్నలు..

రాజీపడిన ప్రధాని ఎప్పటికీ అక్కడ కూర్చోలేరంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రిజిజు, రాహుల్ దేశంలో ఉన్నా, విదేశాలకు వెళ్లినా భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. విదేశీ భారత వ్యతిరేక శక్తులతో ఆయన చేతులు కలిపారని, భారత ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

మొదటి పేజీ తరువాయి ఓవైసీ వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతల ఆందోళన

దమ్ముంటే రాజకీయంగా సిద్ధాంత పరంగా విమర్శించాలి తప్ప వ్యక్తిగత విమర్శలకు రాజకీయాలలో తావు లేదని, వెంటనే ఆమెకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఓవైసీని డిమాండ్ చేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కోట నీలిమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఓవైసీ నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

మొదటి పేజీ తరువాయి శ్రీవారి ఆలయంలో వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం

ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ సాధికారిక మండలి చైర్మన్, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, జేఈవో డాక్టర్ శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. "గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం. తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది" అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.టీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. తన నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అభివృద్ధి అంటే కేవలం కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలే కాదని దుయ్యబట్టారు. మునుగోడు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు.అంతేకాదు, నిధులు ఇవ్వకుంటే మరో కురుక్షేత్రం తప్పదని ఆయన హెచ్చరించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో రెండేళ్లే పదవిలో ఉంటారని వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే, అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో అవినీతికి పాల్పడే పాలకులను తెలంగాణ ప్రజలు, చరిత్ర ఎన్నటికీ క్షమించదని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. సిద్ధిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి తనను ఉద్దేశించి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలకు ఆయన పై విధంగా కౌంటర్ ఇచ్చారు.ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా నియమితులైన బి.ఎం.సందీప్ ఆదివారం(నవంబరు 22న) హైదరాబాద్‌కు రానున్నారు. గాంధీభవన్‌లో జరగనున్న రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)ల ఉమ్మడి సమావేశంలో ఆయన పాల్గొంటారు. తర్వాత నవంబరు 23న సోమవారం గాంధీభవన్‌లో ఉదయం మంత్రులతో, మధ్యాహ్నం నుంచి డీసీసీ అధ్యక్షులు, పీసీసీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశమవుతారు.

మొదటి పేజీ తరువాయి కొండగట్టులో అపురూప ఘట్టం..

శాస్త్రోక్తంగా బంగారం, వెండి, చెక్క పరికరాలను వినియోగించి స్వామివారి చందనాన్ని తొలగించారు. చందనాన్ని తొలగించిన అనంతరం పంచనదుల జలాలు, సముద్రపు నీటితో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి తీసుకొచ్చిన పట్టువస్త్రాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంప్రదాయబద్ధంగా ముందుగా అద్దంలో స్వామివారి రూపాన్ని ప్రతిబింబింపజేసి, ఆ తర్వాత అర్చకులు, భక్తుల దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. స్వామివారి నిజరూప దర్శనం డిసెంబర్ 29 వరకు భక్తులకు అందుబాటులో ఉంటుందని అర్చకులు వెల్లడించారు. చివరిసారిగా 1965లో ఈ చందనోత్సవం జరగ్గా, సుమారు ఆరు దశాబ్దాల తర్వాత లభించిన ఈ అపురూప దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది.

మొదటి పేజీ తరువాయి అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ల వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదల

ఈ మేరకు జిల్లాలు, మండలాల వారీగా వెరిఫికేషన్ తేదీలు, నిర్వహించే ప్రదేశాలు, బాధ్యతలు నిర్వర్తించే అధికారుల వివరాలతో కూడిన సమగ్ర షెడ్యూల్‌ను సీఐడీ విడుదల చేసింది. వెరిఫికేషన్‌కు హాజరయ్యే బాధితులు తప్పనిసరిగా తమ వద్ద ఉన్న అగ్రిగోల్డ్ డిపాజిట్ బాండ్ పత్రాలు, సంబంధిత రశీదులు, గుర్తింపు కార్డులు తదితర అవసరమైన ఆధారాలను తీసుకురావాలని సూచించింది. బాధితులు తమకు కేటాయించిన తేదీ, వెరిఫికేషన్ కేంద్రం వివరాలను పరిశీలించి, నిర్ణీత సమయంలో సంబంధిత అధికారుల ఎదుట హాజరుకావాలని సీఐడీ కోరింది. అగ్రిగోల్డ్ బాధితులందరికీ ఈ సమాచారాన్ని చేరవేయడంతో పాటు వెరిఫికేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మీడియా సంస్థలు విస్తృత ప్రచారం కల్పించాలని విజ్ఞప్తి చేస్తుంది.

మొదటి పేజీ తరువాయి డొనాల్డ్ ట్రంప్‌కు ఊరట..

క్రిస్ మర్ఫీ ఓటింగ్‌కు హాజరుకాలేదు. 1973 నాటి వార్ పవర్స్ యాక్ట్ కింద ఈ యుద్ధాన్ని ముగించేందుకు సెనేట్ ఓటింగ్ నిర్వహించడం ఇది 15వ సారి. సెనేట్‌లో చర్చ సందర్భంగా డెమొక్రాట్ సెనేటర్ టామీ బాల్డ్‌విన్ మాట్లాడుతూ, ఈ యుద్ధం వల్ల ఇప్పటివరకు అమెరికా పన్ను చెల్లింపుదారుల సొమ్ము 47 బిలియన్ డాలర్లు ఖర్చయిందని, 23 మంది అమెరికన్లు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయితే, రిపబ్లికన్ సెనేటర్ టిమ్ షీహీ దీనిని వ్యతిరేకిస్తూ.. ఇది ఇష్టపూర్వకంగా చేస్తున్న యుద్ధం కాదని, దేశ భద్రత దృష్ట్యా అనివార్యమైన పోరాటమని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు సాధిస్తే ప్రపంచ ఇంధన సరఫరాలో సగానికిపైగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ఈ ఓటింగ్‌లో తీర్మానం వీగిపోయినప్పటికీ, జనవరిలో కొలువుదీరే కొత్త కాంగ్రెస్‌లో తాము తిరిగి ఈ సమస్యను లేవనెత్తుతామని డెమోక్రటిక్ నేతలు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌లో దూకుడు సైనిక చర్యలకు నిధులను నిరోధించని ఏ బడ్జెట్ ప్యాకేజీనైనా వ్యతిరేకిస్తామని భారత సంతతి కాంగ్రెస్‌మన్ రో ఖన్నా, యాసమిన్ అన్సారీ స్పష్టం చేశారు. డిసెంబర్ 11తో ప్రస్తుత ఫెడరల్ నిధుల గడువు ముగియనుంది.

రైతుల భూ బదలాయింపు సమస్యలను పరిష్కరించాలి



(బజార్‌హత్నూర్, సాక్షర): బజార్‌హత్నూర్ మండల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతుల భూ బదలాయింపు సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి, గతంలో ధరణి పోర్టల్‌లో ఉన్న విధంగా భూ భారతి పోర్టల్‌లో కూడా సంబంధిత నిబంధనలకు అనుగుణంగా భూ బదలాయింపులు చేసుకునే అవకాశం కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.బజార్‌హత్నూర్ మండల ఏజెన్సీ ప్రాంతంలో తరతరాలుగా, తాతముత్తాతల కాలం నుంచి నివసిస్తూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని రైతులు తెలిపారు. అయితే, ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతర రైతులు ప్రస్తుతం భూ బదలాయింపుకు సంబంధించిన సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో భూ బదలాయింపునకు సంబంధించిన అవకాశం ఉండటంతో తమ ప్రాంత గిరిజనేతర రైతులు తమ భూములను చట్టపరమైన నిబంధనల ప్రకారం బదలాయించుకునే ప్రక్రియ కొనసాగించేవారని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను అమల్లోకి తీసుకువచ్చిన తరువాత తమ ఏజెన్సీ ప్రాంత గిరిజనేతర రైతులకు భూ బదలాయింపు చేసుకునే అవకాశం లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు.దీంతో ఎన్నో సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులు తమ భూములకు సంబంధించిన లావాదేవీలు, భూ బదలాయింపులు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్య కారణంగా రైతులు ఆర్థికంగా, సామాజికంగా కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు.కావున, తమ బజార్‌హత్నూర్ మండల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర రైతుల భూ బదలాయింపు సమస్యను ప్రత్యేకంగా పరిశీలించి, గతంలో ధరణి పోర్టల్‌లో ఉన్న విధంగా భూ భారతి పోర్టల్‌లో కూడా సంబంధిత నిబంధనలకు అనుగుణంగా భూ బదలాయింపులు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నామని తెలిపారు.దయచేసి తమ సమస్యను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, తమ ప్రాంత రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని మండలంలోని రైతులు, నాయకులు మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేదలకు ఆర్థిక భరోసా



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తెలిపారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రచారంలో భాగంగా శనివారం డీసీసీ కార్యాలయంలో బీమా పథకం పోస్టర్లు, కరపత్రాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సుగుణక్క ఆవిష్కరించారు. అనంతరం సుగుణక్క మాట్లాడుతూ.. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.5 లక్షల జీవిత బీమా అందించడమే ఈ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.భూమి, ఆస్తులు లేని కుటుంబాలకు సైతం జీవిత బీమా భరోసా కల్పించాలనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన వారు ఈ పథకంలో నమోదు చేసుకోవాలని, కుటుంబంలో ఎవరిని ప్రధాన సభ్యుడిగా ఎంపిక చేసుకోవాలో వారే నిర్ణయించుకోవచ్చని సూచించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ తో హెల్ప్ డెస్క్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలను సైతం గుర్తించి పథకంలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు తారిక్,ఆసిఫాబాద్ మండలం అధ్యక్షుడు రాపర్తి మురళి,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రత్నం ఆనంద్,నియోజకవర్గం అధ్యక్షులు జాడే ప్రసాద్,చిట్ల నారాయణ, సంతోష్, పెంటు,సతీష్, అబ్దుల్, మధు, సత్యనారాయణ, గణేష్, ఆనంద్ రావు, బీమ్ రావు,జానకిరామ్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రజా ట్రస్ట్ నిరంతర కృషి



- బోస్లే మోహన్ రావు పటేల్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

(తానూర్, సాక్షర) విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రజా ట్రస్ట్ నిరంతర కృషి చేస్తుందని బోస్లే మోహన్ రావు పటేల్ అన్నారు. తానూర్ మండల కేంద్రంలోని తానూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్రీ బోస్లే మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బోస్లే మోహన్ రావు పటేల్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిని ఆకాంక్షిస్తూ వారికి చదువులో అవసరమైన సహాయాన్ని అందించాలని గొప్ప సంకల్పంతో విద్యార్థులకు సహాయం చేయడానికి ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్ విద్యార్థులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. విద్యార్థులు అందరూ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రజా ట్రస్ట్ నిరంతర కృషి చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుగంధ మాధవరావు పటేల్, ప్రధానోపాధ్యాయులు సాయిబాబా, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించాలి



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): గిరిజన రైతులకు సోయాబీన్ విత్తనోత్పత్తి సాంకేతికతలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించే లక్ష్యంతో వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్ లో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.గిరిజన రైతులకు సోయాబీన్ విత్తనోత్పత్తి సాంకేతికతలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించే లక్ష్యంతో వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్ లో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తలమడుగు మండలంలోని కోసాయి, ఉన్ని గ్రామాలు, బీంపూర్ మండలంలోని చింతపల్లి గ్రామాలకు చెందిన గిరిజన రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు సోయాబీన్ విత్తనోత్పత్తిలో పాటించాల్సిన మెలుకువలు, నాణ్యమైన విత్తనోత్పత్తికి అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు, పంట సాగులో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై వివరంగా అవగాహన కల్పించారు. ప్రస్తుత పంటకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పత్తి, శనగ, కంది పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన సాగు యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలను కూడా వివరించారు.అనంతరం నిర్వహించిన రైతు-శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో రైతులు వివిధ పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, చీడపీడల నివారణ, పంట యాజమాన్య పద్ధతులకు సంబంధించి తమ సందేహాలను శాస్త్రవేత్తలతో చర్చించి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా. శ్రీధర్ చౌహాన్, సీనియర్ శాస్త్రవేత్త డా. ఎం. పల్లవి, శాస్త్రవేత్తలు డా. డి. మోహన్ దాస్, డా. జి. ప్రవీణ్ కుమార్, కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డా. ఎన్. రామ్ గోపాల్ వర్మ, తలమడుగు మండల వ్యవసాయ అధికారి శ్రీ ప్రమోద్ రెడ్డి పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

మత్స్యకారులకు 100 శాతం సబ్సిడీతో ఐదు లక్షల రుణం ఇవ్వాలి



(మంచిర్యాల ప్రతినిధి, సాక్షర): మత్స్యకారుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడానికై ఎలాంటి షరతులు లేకుండా 100 శాతం సబ్సిడీతో ఐదు లక్షల రుణం ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పింఛన్ ఇవ్వాలని మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బోడెంకి మహేష్ డిమాండ్ చేశారు. వాడబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మంచిర్యాల జిల్లాలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జరిగింది.వాడబలిజ సేవా సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బోడెంకి మహేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు, నాయకులు కలిసికట్టుగా నిర్వహించారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా వాడబలిజ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఎర్రోళ్ల మల్లయ్య చేతుల మీదుగా జెండాను ఎగరవేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వాడబలిజాల ఐక్యత వర్ధిల్లాలి, జై వాడబలిజ, జై జై వాడబలిజ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బోడెంకి మహేష్ మాట్లాడుతూ నవంబర్ 21 ప్రపంచంలోని అన్ని దేశాలు, రాష్ట్రాలు, జిల్లాల ప్రజలు మత్స్యకారుల దినోత్సవం ఘనంగా చేస్తున్నప్పటికీ మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికీ మత్స్యకారులకు విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, మంచిర్యాల జిల్లాలో మత్స్యకారులు అంటే వాడబలిజ, బెస్తలు, గంగపుత్ర ఉన్నారని, స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా మత్స్యకారులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని అన్నారు. వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడానికై ఎలాంటి షరతులు లేకుండా 100 శాతం సబ్సిడీతో ఐదు లక్షల రుణం ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పింఛన్ ఇవ్వాలని, జిల్లాలో మండల కేంద్రాల్లో మత్స్య మార్కెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికీ వాడబలిజ కులానికి కుల సర్టిఫికెట్లు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గారే శంకర్, జిల్లా కోశాధికారి గగ్గూరి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల దశరథం, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రోళ్ల రాజేష్, పట్టణ అధ్యక్షులు గగ్గురి సత్తయ్య, గగ్గురి తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి బోడెంకి కుమార్, పట్టణ ప్రచార కార్యదర్శి నాగుల రమేష్, బద్ది మల్లేష్, గగ్గురి రాజు, గంప రాజేష్, బోడెంకి మనోజ్, పానేం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.



- నకిలీ విత్తనాల విక్రయాలు, అక్రమ రవాణా నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు.
- తరచూ నకిలీ విత్తనాల కేసుల్లో పట్టుబడితే పీడీ యాక్ట్ అమలు.
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

(రాజన్న సిరిసిల్ల, సాక్షర): జిల్లాలో నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలను విక్రయించినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, తరచూ ఇటువంటి కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. శనివారం రోజున పోలీస్ , వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, ఎరువులు, విత్తనాల నిల్వలు, బిల్లులు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులపై ఉందని, జిల్లాలోని ఫర్టిలైజర్, సీడ్స్ షాపులపై నిరంతరం నిఘా ఉంచి నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తున్నన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, నాణ్యతపై అనుమానం ఉన్నా లేదా ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ప్రజలకు, రైతులకు సూచించారు. రైతులను నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల బారి నుంచి రక్షించేందుకు జిల్లా పోలీస్, వ్యవసాయ శాఖ సమన్వయంతో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తాయని తెలిపారు. ఈతనిఖీల్లో పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు

జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.శనివారం కలెక్టర్ పట్టణంలోని గొల్లపేట్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీమా నమోదు తీరును పర్యవేక్షించారు. ఒక కుటుంబానికి బీమా నమోదు చేయడానికి దాదాపు ఎంత సమయం అవుతుందో స్వయంగా పరిశీలించారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు.స్థానిక అధికారులంతా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం శిబిరాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.ప్రజలంతా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం కింద నమోదయ్యేలా చొరవ చూపాలని తెలిపారు.ఈ పథకంపై ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్న వారికి అర్థమయ్యేలా తెలియజేయాలని అన్నారు. ప్రక్రియ పూర్తి చేసిన కుటుంబాల వివరాలన్నీ స్పష్టంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో సిపిఓ గంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, స్థానిక కౌన్సిలర్ సురేష్,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా చూడాలి

(ఆదిలాబాద్, సాక్షర): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా చూడాలని, నామినేటెడ్ పదవుల నియామకాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ సిఫార్సు చేసిన వారికే కేటాయించాలని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ తీర్మానించింది.నామినేటెడ్ పదవులలో జిల్లా కాంగ్రెస్ సిఫార్సు చేసిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన పిఏసి సమావేశంలో నిర్ణయించారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతో పాటు పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు.సమావేశంలో పిఏసి సభ్యులు తమ విలువైన సూచనలు, సలహాలు అందించగా, అనంతరం అధ్యక్షుల ముగింపు ప్రసంగం, కృతజ్ఞతలతో కార్యక్రమం ముగిసింది.

మదన పోచమ్మ బోనాల జాతర ఏర్పాట్ల పరిశీలన



(చెన్నూర్, సాక్షర): కోటపల్లి మండలం జనగామ గ్రామంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న మదన పోచమ్మ అమ్మవారి బోనాల జాతర ఏర్పాట్లను చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ పరిశీలించారు. ఆలయ పరిసరాలను పరిశీలించి జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించినట్లు గ్రామ సర్పంచ్ మారిశెట్టి పద్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



(లక్ష్మణ్ చాందా, సాక్షర): మండలం లోని పిచర గ్రామంలో మత్స్య సహకార సొసైటీలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం గుర్రం బొర్రన్న నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ మత్స్యకారుల పోస్టర్లను ఆవిష్కరించి ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించుకున్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో ఇతర వర్గాల సహకారంతో సాధించుకున్న సొసైటీని మరింత బలోపేతి చేసి గ్రామంలో ఆదర్శంగా ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సొసైటీ సభ్యులు కుల పెద్దలు పాల్గొన్నారు.

సిద్దిపేట ఒకప్పుడు ఎట్లా ఉండే ఇప్పుడు ఎట్లా ఉంది

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

హరీష్ రావు హయంలో సిద్దిపేట అభివృద్ధి చేందిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి కతాబునిచ్చారు. పలు విద్యా సంస్థలు వచ్చాయని గుర్తు చేసారు. హరీష్ రావు, కేసీఆర్ అడుగులో అడుగు వేస్తూ ఉద్యమంలో భాగమై తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ గారి వెంబడి ఉండి రాష్ట్ర ఏర్పాటుకు తోడు అందించి రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకున్న వ్యక్తి అని అన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడు హరీష్ రావు బిజెపి

ఈ నెల 26 న మహిళలు - రాజ్యాంగం సదస్సు

(హైదరాబాద్, సాక్షర): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈనెల 26న బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళలు - రాజ్యాంగం సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా శనివారం నాడు బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత మహిళా నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు.. ఆ ఫలాలు ఎంతమేరకు అందుతున్నాయి.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన తరుణంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలు.. శ్రామికులు, గృహిణుల జీవన స్థితిగతులు సహా మహిళలకు సంబంధించిన అన్ని అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి, ఐటీడీఏ ఉట్నూర్ మంద మకరందు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి, ఐటీడీఏ ఉట్నూర్ మంద మకరందు ఒక ప్రకటనలో తెలిపారు.గెస్ట్ డిగ్రీ లెక్చరర్ - తెలుగు, ఫిజిక్స్ పోస్టులు కలవు. 50 శాతం మార్కులతో పీజీ, నెట్, సెట్, పీహెచ్‌డీలలో అర్హత ఉండాలి.27.11.2026 లోపు ఐటీడీఏ ఆదిలాబాద్ కు దరఖాస్తులు సమర్పించాలి.వివరాలకు ఆర్‌సీఓ, ఐటీడీఏ ఉట్నూర్ కార్యాలయంలో సంప్రదించగలరు.

పౌల్ట్రీ దిగ్గజం స్నేహ ఫామ్స్‌కు ఐటీ షాక్

(హైదరాబాద్, సాక్షర): ప్రముఖ పౌల్ట్రీ, అగ్రి బిజినెస్ సంస్థ స్నేహ గ్రూప్ పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మికంగా సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ సహా పలు చోట్ల ఉన్న సంస్థ కార్యాలయాలతో పాటు హైదరాబాద్ కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్నేహ గ్రూప్ డైరెక్టర్లు రామ్ రెడ్డి డెండి, వరుణ్ రెడ్డి డెండి, స్నేహ డెండి నివాసాల్లో ఐటీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.1982లో 'రామ్ రెడ్డి చికెన్ మార్కెట్'గా ప్రారంభమైన ఈ సంస్థ, 1994లో స్నేహ ఫామ్స్ గా విస్తరించి అంచెలంచెలుగా ఎదిగింది. ప్రస్తుతం ఈ గ్రూప్ పౌల్ట్రీ బ్రీడింగ్, చికెన్ ప్రాసెసింగ్, పశువుల దాణా, సఫల బ్రాండ్ పేరుతో వంట నూనెల తయారీ రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తోంది. తెలంగాణలో గంటకు 12,000 కోళ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యం గల అత్యాధునిక ఆటోమేటెడ్ ప్లాంట్‌ను ఈ సంస్థ నిర్వహిస్తోందని తెలిసిందే.2,000 మందికి పైగా కాంట్రాక్ట్ రైతులతో కలిసి వ్యాపారం చేస్తున్న స్నేహ గ్రూప్, భారత రక్షణ సంస్థలకు (డిఫెన్స్) సైతం ఫ్రోజెన్ చికెన్ సరఫరా చేస్తోంది. అంతేకాకుండా, 2024 ఆర్థిక సంవత్సరంలో సింగ్ పౌల్ట్రీని కొనుగోలు చేసిన ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్‌కు చెందిన దిగ్గజ కంపెనీ మిట్సుయి & కో కూడా ఆసక్తి చూపింది. సంస్థ లావాదేవీలు, లెక్కల్లో అవకతవకలు ఉన్నాయన్న సమాచారంతో ఐటీ శాఖ రంగంలోకి దిగి ఆకస్మిక తనిఖీలు చేపట్టింది.

క్షేత్ర స్థాయిలోకి దిగండి... ప్రజల గోడు వినండి...

- శిక్షణ అధికారులకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశం

(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజల జీవన పరిస్థితులు, స్థానిక సమస్యలపై క్షేత్రస్థాయిలో సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శిక్షణ సివిల్ సర్వీస్ అధికారులకు సూచించారు.అటవీ హక్కుల పట్టాలు, గిరిజనుల గృహ నిర్మాణాలు, సాగునీటి వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 22 నుంచి 25 వరకు గ్రామీణ ప్రాంతాల్లో, 26 నుంచి 28 వరకు పట్టణ ప్రాంతాల్లో శిక్షణ సివిల్ సర్వీస్ అధికారుల పర్యటనలు ఉంటాయి.2026 ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఫౌండేషన్ కోర్సులో భాగంగా ఈ నెల 22 నుంచి 25 వరకు గ్రామీణ ప్రాంతాల్లో, 26 నుంచి 28 వరకు ఆదిలాబాద్ పట్టణంలో పర్యటనలు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలు, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకోవాలన్నారు. జిల్లాలో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతాల నేపథ్యంలో అటవీ హక్కుల చట్టం అమలు, గిరిజనులకు మంజూరైన పట్టాలు, పీవీటీజీ, కోలాం, తోటి కుటుంబాల గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించాలని సూచించారు.అలాగే చెరువులు, సాగునీటి వనరులు, రైతులు సాగు చేస్తున్న పంటలు, వారి ఆదాయ మార్గాలపై అధ్యయనం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వైద్య కేంద్రాలు, అంగన్‌వాడీలను సందర్శించి విద్య, వైద్య, పోషకాహార సేవల పనితీరును పరిశీలించాలని తెలిపారు.పట్టణ పర్యటనల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. పర్యటనల అనంతరం సమీక్ష నిర్వహించి అధికారుల అనుభవాలు, పరిశీలనలను తెలుసుకుంటామని తెలిపారు. శిక్షణ అధికారులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకరిస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ రవీందర్, డీపీఓ రమేష్, డీఈఓ మడావి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజలింగు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



(జన్నారం, సాక్షర): చెరువులు, కుంటలు, నదులు, జలాశయాలే జీవనాధారంగా తరతరాలుగా చేపల వేట వృత్తిని కొనసాగిస్తున్న సంప్రదాయ గంగపుత్రులు, గుండ్ల బెస్తల జీవన విధానం ప్రత్యేకమైనది. ప్రకృతితో మమేకమై, నీటి ప్రవాహాలు, చేపల కదలికలు, వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ చేపల వేట సాగించడం వీరి వృత్తి నైపుణ్యానికి నిదర్శనం.రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదాయ మత్స్యకారులను తెలంగాణ ఏర్పాటు అయిన నుండి సరిగా గుర్తించకపోగా ఇతర కులస్తులకు సొసైటీలు చేస్తూ అసలైన గంగపుత్రుల జీవనోపాధిని కొల్లగొట్టుతున్నారు. ఓట్ల కోసం ప్రాధాన్యత ఇస్తు మా కులవృత్తిని దోపిడీ చేసే విధంగా జరగడం చాలా బాధాకరం అలాగే చాలా చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నాయని ప్రభుత్వం, అధికారులు కఠినంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు ప్రాచీన కాలం నుంచి గంగపుత్రులు, గుండ్ల బెస్తలు తమ పూర్వీకుల నుంచి నేర్చుకున్న చేపల వేట పద్ధతులను నేటికీ కొనసాగిస్తున్నారు. వలలు, తెప్పలు, పడవలు, సంప్రదాయ చేపల వేట పరికరాలను ఉపయోగిస్తూ చెరువులు, నదులు, జలాశయాల్లో చేపల వేట సాగిస్తుంటారు. నీటిలో చేపల సంచారం గుర్తించడం, సరైన సమయంలో వల వేయడం, చేపలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడం వంటి అంశాల్లో వీరికి అపారమైన అనుభవం ఉంటుంది.మత్స్యకారుల జీవితం ఎంతో కష్టసాధ్యమైనది. తెల్లవారుజామునే చేపల వేటకు బయలుదేరి, ఎండ, వాన, చలి వంటి ప్రకృతి పరిస్థితులను ఎదుర్కొంటూ కుటుంబ పోషణ కోసం శ్రమిస్తుంటారు. వారి శ్రమ కేవలం కుటుంబ జీవనోపాధికే పరిమితం కాకుండా, ప్రజలకు పోషకాహారమైన చేపలను అందిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా తోడ్పడుతుంది.ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా సంప్రదాయ గంగపుత్రులు, గుండ్ల బెస్తల చేపల వేట పద్ధతులను, వారి వృత్తి నైపుణ్యాన్ని, సంస్కృతి సంప్రదాయాలను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉంది. ఆధునిక కాలంలో మత్స్యకార వృత్తి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, యువతకు ఈ సంప్రదాయ వృత్తిపై అవగాహన కల్పించాలి. గంగపుత్రుల సంప్రదాయం మన సంస్కృతికి ప్రతీక... వారి చేపల వేట మన గ్రామీణ జీవనానికి జీవనాడి... వారి శ్రమకు గౌరవం, వారి కుటుంబాలకు సంక్షేమం, వారి వృత్తికి భవిష్యత్తు కల్పించడం ప్రభుత్వం బాధ్యత ఈ కార్యక్రమంలో గంగపుత్ర నాయకులు కల్లెడ నరసయ్య కల్లెడ భూమయ్య గుమ్ముల లింగయ్య కల్లెడ పెద్ద భూమయ్య నాగుల మల్లయ్య పల్లికొండ నర్సయ్య, నారాయణ కొండ్ర పలువురు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



(ఖానాపూర్, సాక్షర): ఖానాపూర్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఈ బ్రహ్మోత్సవాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన గ్రంథాలయం, మిద్దె తోట ప్రారంభం



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రణదీవే నగర్ లో నూతనంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా మిద్దె తోటను జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి ప్రారంభించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి బి. లక్ష్మణ్, ఆరోగ్య పాఠశాల కన్వీనర్ అజయ్, పాఠశాల వార్డు కౌన్సిలర్ అన్నపూర్ణ, ప్రధానోపాధ్యాయులు కత్తి శ్రీహరి బాబు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగాసాగర్, ఉపాధ్యాయులు జయసుధ, అరుణ, బి. ప్రసాద్, షేక్ అలీ, గంగేశ్వర్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన హల్వాలే నేహా ఇటీవల మృతి చెందారు. శనివారం ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేహా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఉండాలని కోరారు. కార్యక్రమంలో దాసరి రమేష్, చందాల రాజన్న, కొండ గణేష్, అనిల్, దమ్మ పాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం

- మంత్రి పొన్నం

(హైదరాబాద్, సాక్షర): మినిస్టర్ క్వార్టర్స్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది.కమిటీ చైర్మన్ కే. కేశవరావు , ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం , మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ , మోతే శోభన్ రెడ్డి , శ్యాం మోహన్ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ఇప్పటికే వివిధ యూనివర్సిటీల ఉద్యమకారులు, కళాకారులు, సబ్బండ వర్గాలతో జరిపిన సంప్రదింపులు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, పనుల పురోగతిని సమీక్షించాం. గుర్తింపు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని అన్నారు. ఉద్యమకారుల వివరాల నమోదు, గుర్తింపు ప్రక్రియ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్ ప్రస్తుత స్థితిని సమీక్షించి, వీలైనంత త్వరగా వెబ్‌సైట్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు కల్పించడమే మా లక్ష్యం. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు కమిటీ తరఫున అన్ని విధాలుగా కృషి చేస్తాం. వెబ్‌సైట్ ఏర్పాటుపై తదుపరి పురోగతిని త్వరలోనే సమీక్షించి, ప్రారంభ తేదీతో పాటు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు.


సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ తల్లి పరామర్శించిన రేఖా శ్యాంనాయక్



(జన్నారం, సాక్షర): జన్నారం పట్టణానికి చెందిన పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ తల్లి కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖా శ్యాంనాయక్ వారి ఇంటికి వెళ్ళి పలకరించారు.ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును నిశితంగా పరిశీలించాలి

- ఆలిండియా సర్వీసెస్ అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి మార్గనిర్దేశం



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) ఆలిండియా సర్వీసెస్ అధికారులు తమ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నిశితంగా పరిశీలన జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. 14 మందితో కూడిన ఆలిండియా సర్వీసెస్ అధికారులు శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం శనివారం నిజామాబాద్ జిల్లాకు చేరుకున్నారు. ఈ నెల 21 నుండి 28 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుపనున్నారు. సమీకృత జిల్లా కార్యాలయంలో వారు కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అలోక్ సింగ్, లోకేష్ మనోహర్ పాటిల్, మనిష్ పరిహార్, ప్రవీణ్ కుమార్, సచిన్ గోయెల్, శివం, రోమేల్ బిజల్వాన్, అభిషేక్ పరిహార్, దీపక్ శర్మ, నిహాల్ చంద్, పూజా మీనా, శుభం శుభ్, వికాస్ యాదవ్, నిధి కరన్వాల్ లను జిల్లా పాలనాధికారి స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. వీరిని రెండు బృందాలుగా విభజిస్తూ, ఒక్కో బృందానికి ఒక్కో గ్రామాన్ని క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటాయించారు. ఆర్మూర్ డివిజన్ లోని అంకాపూర్ కు ఒక బృందాన్ని, బోధన్ డివిజన్ లోని భూలక్ష్మిక్యాంపు నకు మరో బృందాన్ని కేటాయించారు. క్షేత్రస్థాయి సందర్శనకు బయలుదేరి వెళ్ళడానికి ముందు కలెక్టర్ ఇలా త్రిపాఠితో భేటీ అయ్యారు. వారికి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. నిజామాబాద్ ప్రధానంగా వ్యవసాయాధారిత జిల్లా అయినందున సాగు రంగంపై ఆధారపడి 70 శాతం మంది జీవనాలు వెళ్లదీస్తున్నారని వివరించారు. జిల్లాలో భారీ నీటి పారుదల ప్రాజెక్టు అయిన శ్రీరాంసాగర్ రిజర్వాయర్ సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంలో ఎంతో కీలకంగా నిలుస్తోందని, అవకాశం మేరకు ఈ ప్రాజెక్టును సందర్శించాలని సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించాలని, భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమాన్ని, ప్రజల జీవన స్థితిగతులను గమనించాలని అన్నారు. అన్ని అంశాలను నిశితంగా పరిశీలన జరిపి ఆకళింపు చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ పి.సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, ఇంచార్జి డీపీఓ నాగరాజు, సీ.పీ.ఓ రతన్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, ఆర్మూర్, బోధన్ తహసిల్దార్లు సత్యనారాయణ, విట్టల్ తదితరులు ఉన్నారు.


నకిలీ జీపీఏతో భూ కబ్జా.. ఇద్దరు నిందుతులు అర్టెస్

• ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా

(ఆదిలాబాద్, సాక్షర) భూ యజమానుల అనుమతి లేకుండా వారి భూములను అక్రమంగా కబ్జా చేసి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరులకు విక్రయిస్తూ మోసాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను ఆదిలాబాద్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా తెలిపారు.భూ యజమానుల అనుమతి లేకుండా ఇతరుల భూములను అక్రమంగా ప్లాట్లుగా మార్చి విక్రయించారు. నకిలీ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్ సృష్టించి మోసానికి పాల్పడిన నిందితులు అరెస్టు అయ్యారు. నకిలీ పత్రాలను సృష్టించిన డాక్యుమెంట్ రైటర్ కూడా అరెస్టు అయ్యాడు.కేసు వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఫిర్యాదుదారుడు అనంత్ కుమార్ సమ్నాని ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.ఫిర్యాదుదారుడికి సంబంధించిన రణదివెనగర్ శివారులోని సర్వే నంబర్ 64/2/3 పరిధిలో గల భూమికి సంబంధించి నిందితుడు మహమ్మద్ నవీద్ అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో భూమి యజమాని నుంచి వివిధ వ్యక్తులు భూమిని కొనుగోలు చేయగా, వాటికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణాలు వేర్వేరుగా కేటాయించబడ్డాయి.ఈ క్రమంలో నిందితుడు నవీద్ తనకు సంబంధించిన భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించడంతో పాటు, ఫిర్యాదుదారుడికి చెందిన భూమిని కూడా తనకు హక్కు లేకపోయినా అక్రమంగా ప్లాట్లుగా చూపించి ఇతరులకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.అంతేకాకుండా 2025లో సదరు భూములకు సంబంధించి నకిలీ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్ నంబర్ 6811/2025ను సృష్టించి, డాక్యుమెంట్ రైటర్ సయ్యద్ మున్నవర్ ఖాన్‌తో కలిసి ఫిర్యాదుదారుడికి చెందిన భూమిని అక్రమంగా ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో ఆదిలాబాద్ రూరల్ పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు మహమ్మద్ నవీద్, డాక్యుమెంట్ రైటర్ సయ్యద్ మున్నవర్ ఖాన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన భూమి రికార్డులు, డాక్యుమెంట్లపై తదుపరి విచారణ కొనసాగుతోంది. ఏ-1: మహమ్మద్ నవీద్ (31), తండ్రి మసూద్, వడ్డెర కాలనీ, ఒస్మానియా మసీదు సమీపం, ఆదిలాబాద్. ఏ2: సయ్యద్ మున్నవర్ @ సయ్యద్ మున్నవర్ ఖాన్ (31), తండ్రి మన్నన్, వృత్తి డాక్యుమెంట్ రైటర్, తాటిగూడ, ఆదిలాబాద్ నిందితులుగా గుర్తించారు. ఈసందర్భంగా ఆదిలాబాద్ రూరల్ సీఐ రహీం పాషా మాట్లాడుతూ ఇతరుల భూములను అక్రమంగా కబ్జా చేయడం, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం, తప్పుడు పత్రాల ఆధారంగా భూములను విక్రయించడం తీవ్రమైన నేరాలని తెలిపారు. భూములు కొనుగోలు చేసే ముందు సంబంధిత డాక్యుమెంట్లు, యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించుకోవాలని ప్రజలకు సూచించారు. ఇలాంటి భూ మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అరెస్టులో ఎస్ఐ వి. విష్ణువర్ధన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

• ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు అందజేత



(బజార్‌హత్నూర్, సాక్షర) పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేయూత పింఛన్లను అందిస్తూ అండగా నిలుస్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు.బజార్‌హత్నూర్‌లో చేయూత పింఛన్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేసిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా, బోథ్ ఎమ్మెల్యే, ఉర్దూ అకాడమీ చైర్మన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసిన ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ తో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపుల నర్సయ్య, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపుల సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పరచ సాయన్న, డీఆర్డీఓ పిడి రవీందర్ రాథోడ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేయూత పింఛన్లను అందిస్తూ అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నిజామాబాద్ కు సురక్షిత కిరీటం.. ఎయిడ్స్ పై పోరులో రాష్ట్రానికే ఆదర్శం

• ఎయిడ్స్ నియంత్రణలో నిజామాబాద్ జిల్లాకు సురక్షిత్ గుర్తింపు అభినందనీయం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



(నిజామాబాద్ ప్రతినిధి, సాక్షర) నిజామాబాద్ జిల్లాలో హెచ్ఐవి / ఎయిడ్స్ నిర్ధారణ నియంత్రణ నివారణ కార్యక్రమాల అమలులో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, డాప్యూ సిబ్బంది, కనబరిచిన పనితీరు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రశంసించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో గణనీయమైన ప్రగతి కనబరిచి నిజామాబాద్ జిల్లా సురక్షిత కేటగిరిలో గుర్తింపు పొందిన నేపథ్యంలో నాకు డిప్యూటీడైరెక్టర్ నరేష్ రెడ్డి , డి ఎం హెచ్ ఓ డాక్టర్ బి రాజశ్రీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఐ డి ఓ సి లో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నాకు ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మాన్ సమరోహ్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సురక్షితగిరికి నిజామాబాద్ జిల్లా ఎంపికవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సురక్షిత గుర్తింపు జిల్లా యంత్రాంగం వైద్యానికి శాఖ ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు సిబ్బంది ఐ సి టి సి ఏ ఆర్ టి సి ఎస్ సి కేంద్రాలు స్వచ్ఛంద సేవా సంస్థలు సంబంధిత సిబ్బంది సమిష్టి కృషి సమన్వయంతో సాధ్యమైందని తెలిపారు. ఇంతటితో సంతృప్తి చెందకుండా ఇదే స్ఫూర్తితో హెచ్ఐవి నిర్ధారణ, నివారణ ,విస్తృత స్థాయిలో పరీక్షలు, సకాలంలో చికిత్స అందించడం, హెచ్ఐవి తో జీవిస్తున్న వారికి నిరంతర వైద్య సేవలు కల్పించడం వంటి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రజలను అవగాహన పెంపొందిస్తూ ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ నరేష్ రెడ్డి ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ, అడిషనల్ డైరెక్టర్ ఫనీ రేఖ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ భార్గవి, ఏఆర్టి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, డిపిఎం సుధాకర్, డి హెచ్ ఈ ఘన్సూర్ వెంకటేశ్వర్లు, సి ఎస్ ఓ నవీన్ , సిపిఓ మోహిజ్ ,వై ఆర్ జి సుధాకర్ , సహాయోగి సమత, స్నేహ సొసైటీ శివ, సిఎస్సి కోఆర్డినేటర్ అఖిల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

• కేజీబీవీ విద్యార్థినులకు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ జయకృష్ణ రెడ్డి



(చెన్నూర్, సాక్షర) విద్యార్థినులు తమలోని అంతర్గత ప్రతిభను గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఎం. జయకృష్ణ రెడ్డి అన్నారు. శనివారం చెన్నూరు పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం లో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ప్రేరణాత్మక (మోటివేషన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనఆయనవిద్యార్థినులనుఉద్దేశించిస్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా జయకృష్ణ రెడ్డి మాట్లాడుతూవిద్యార్థి దశ నుంచే స్పష్టమైన, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కేవలం లక్ష్యాలను ఎంచుకోవడమే కాకుండా, వాటిని చేరుకోవడానికి క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి ఎంతో అవసరమని వివరించారు. ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.ఈ ప్రేరణాత్మక కార్యక్రమం విద్యార్థినుల్లో నూతన ఉత్సాహాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపింది. కార్యక్రమ ప్రత్యేక అధికారిణి ఎ.సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



(ఉట్నూర్, సాక్షర) ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గిరి ఉత్సవాల నిర్వహణపై ఆదివాసీ తెగల నాయకులతో సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.గిరిజన ఆదివాసీ లోని చారిత్రక రాజుల కోటలో గిరి ఉత్సవాల నిర్వహణపై ఆదివాసీ తెగల నాయకులు, పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గిరి ఉత్సవాలను ఆదివాసీ తెగలందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని, ఆదివాసీ కళలు, సంస్కృతి, సంప్రదాయాలకు ఉత్సవాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఉత్సవాల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ మంద మకరంద్, ఏఎస్పీ రిత్విక్, ఆదివాసీ తెగల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

బాలసదనంలో వసతి పొందుతున్న పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి



• జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) బాలసదనంలో వసతి పొందుతున్న పిల్లలందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.జాతీయ బాలల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ గ్రామంలో గల బాలసదనాన్ని సందర్శించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన బాలసదనంలోని వివిధ విభాగాలను పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలందరికీ అన్ని వసతులు కల్పించాలన్నారు. చిన్నారులతో నేరుగా మాట్లాడి వారి వివరాలు, బాలసదనంలో సౌకర్యాలు, ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అని, వారి జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే అధికారులకు తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని తెలిపారు.బాలసదనం అధికారులతో మాట్లాడుతూ, చిన్నారులకు ఎటువంటి సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు విమానాల్లో సందర్శనకు తీసుకువెళ్లాలని సూచించారు. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో వారికి సందేశాత్మకమైన, వారి మనోస్థైర్యం నింపేలా మంచి మంచి సినిమాలను ప్రదర్శించాలన్నారు. ఆటలు ఆడించాలన్నారు. వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి వారిని భాగస్వామ్యం చేయాలని చెప్పారు. త్వరలోనే సొంత భవనంలోనికి బాలసదనాన్ని మారుస్తామని హామీ ఇచ్చారు.చిన్నారులతో కేకు కట్ చేయించి, వారికి కానుకలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వినూత్న, అధికారులు మురళి, వైష్ణవి, రాజు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అంశం సైన్స్ తో ముడిపడి ఉంది

• రెవెన్యూ డివిజన్ అధికారి జగదీశ్వర్ రావు



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర) మన జీవితంలో ప్రతి అంశం సైన్స్ తో ముడిపడి ఉందని రెవెన్యూ డివిజన్ అధికారి జగదీశ్వర్ రావు అన్నారు.శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ లో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి పుల్లూరి జగదీశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మన జీవితంలో ప్రతి అంశం సైన్స్ తో ముడిపడి ఉందన్నారు.ఈ రోజులలో సైన్స్ దినదినాభివృద్ధి చెందుతూ ఉంటే మరోవైపు అశాస్త్రీయత కూడా అదే స్థాయిలో పెరుగుతోందన్నారు. ఏ విషయాన్నీ ఎవరు చెప్పిన గుడ్డిగా నమ్మకుండా దాన్ని పరిశీలించి రుజువు చేయబడిన తర్వాతనే నమ్మాలని, శాస్త్ర సాంకేతిక రంగంలో ఘనమైన అభివృద్ధి చెందిన ఈ తరుణంలో కూడా మూఢనమ్మకాలు నమ్మడం సరైంది కాదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్ లో అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కేవలం ప్రభుత్వం బాధ్యతగా భావించడం సరికాదని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.విద్యార్థులుగా మీరందరూ శాస్త్రీయ అవగాహనతో ప్రతి అంశాన్ని పరిశీలించి పరిశోధించి బాల శాస్త్రవేత్తలుగా ఎదిగి మన దేశానికి సైన్స్ లో నోబెల్ లాంటి ప్రతిష్టాత్మక బహుమతులు సాధించి భారత దేశ గొప్పతనాన్ని నలుమూలలా చాటాలని చెప్పారు. అనేక సైన్స్ సంబంధం విషయాలు, కాంతి వేగం, గురుత్వాకర్షణ శక్తి, న్యూటన్ గమన సూత్రాలకు సంబంధించి విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి, వారిలో పరిశోధనల పట్ల ఆసక్తి కలిగేలా స్ఫూర్తి పొందేలా మాట్లాడడం జరిగింది. మండల స్థాయి ప్రశ్నపత్రాలను ఆర్డీవో చేతుల మీదుగా విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపల్ దేవేందర్ పటాస్కర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్, గౌరవ అధ్యక్షులు ఏ. దయాకర్, జిల్లా కోశాధికారి ఏ. సంతోష్, వైభవ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బేలలో పవర్ కట్... మసాల ఫీడర్ లో భారీ మరమ్మతులు

(బేల, సాక్షర): మండలంలోని దోప్టాల నుండి డేరా సబ్ స్టేషన్ వరకు నూతన ఫీడర్ ఏర్పాటు పనుల కారణంగా ఈనెల 22న ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మసాలా ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ తెలిపింది.వినియోగదారులకు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది.దోప్టాల నుండి డేరా సబ్ స్టేషన్ వరకు నూతనమైన ఫీడర్ ను ఏర్పాటు చేస్తున్నారు. అందుకు కొత్త స్తంభాలు వేయడం, దానికి వైర్లు లాగే పని చేపడుతున్నారు. స్వల్ప అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈనెల 23న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

• వ్యవస్థాపకులు సదానందు స్వామి

(నిర్మల్ ప్రతినిధి, సాక్షర) కార్తీక మాసంలోని పవిత్రమైన సోమవారం, పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు,అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యక్రమ వ్యవస్థాపకులు సదానందు స్వామి తెలిపారు.ఈ సందర్భంగా భక్తులందరూ భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. వ్రతంలో దంపతులుగా కూర్చొని పూజలునిర్వహించదలచిన భక్తులు ముందుగా తమ పేర్లను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం భక్తులకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్తీక మాస పవిత్రతను చాటుతూ ఆధ్యాత్మిక భావన, భక్తి, సేవాభావంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సదానందు స్వామి కోరారు.వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా నిర్వాహకులను సంప్రదించి తమ పేర్లు తెలియజేయగలరు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్నిసందర్శించిన పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి

• జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చ



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) జిల్లా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు అంశాలు, పార్టీ బలోపేతం, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. శనివారం చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదిలాబాద్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి సాదర స్వాగతం పలికారు. ఆయనతోపాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు, భైన్సా నియోజకవర్గ సీనియర్ నాయకులు విట్టల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డికి ఘన స్వాగతం తెలపడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు అంశాలు, పార్టీ బలోపేతం, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు తదితర అంశాలపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిపిసిసి జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మాజీ డిసిసి సాజిద్ ఖాన్, ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, జిల్లా కాంగ్రెస్ ఆఫీస్ ఇంచార్జ్ గౌలి సంజీవ్, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9న మానుకోటలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి



(ఆదిలాబాద్, సాక్షర): తెలంగాణలోని ఆదివాసీ తొమ్మిది తెగల ప్రజలు, రాయి సెంటర్స్ సార్ మేడిలు, పటేల్ వ్యవస్థ, యువత, విద్యార్థులు, కార్మిక కర్షక వర్గాల ప్రజలు, మహిళలు, ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు, ఆదివాసీ హక్కుల కోసం పోరాడే ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి డిసెంబర్ 9న మానుకోటలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్, కొడప సోనేరావు, కోలం సేవా సంగం రాష్ట్ర అధ్యక్షులు పిలుపునిచ్చారు.శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్ యందు ఆదివాసి సంఘ నాయకులతో కలిసి వాల్ పోస్టర్లు విడుదల చేసిన ఆదివాసి ప్రజాసంఘాల నాయకులు ఈ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గోడం గణేష్, కోలం సేవా సంగం రాష్ట్ర అధ్యక్షులు కొడప సోనేరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 50 సంవత్సరాలుగా లంబాడాలు నిజమైన ఆదివాసీలము మేమే అన్నట్లు వ్యవహరిస్తూ నిజమైన అడవి బిడ్డలకు తీవ్ర అన్యాయం చేస్తూ వస్తున్నారని అన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా, చట్ట విరుద్ధంగా ఎస్టీ జాబితాలో కొనసాగుతూ అడవి బిడ్డలకు అందవలసిన విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్స్, అభివృద్ధి సంక్షేమ పథకాలన్నీ లంబాడ సామాజిక వర్గమే కొల్లగొడుతూ అడవి బిడ్డలకు తీవ్ర అన్యాయం చేస్తూ వస్తున్నారని అన్నారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం షెడ్యూల్డ్ తెగల గుర్తింపు, జాబితాలో లంబాడాలు లేరని, రాష్ట్రపతి ఆమోదం లేదని, పార్లమెంటు, అసెంబ్లీ తీర్మానం లేదని, కనీసం కమిషన్ తీర్మానం కూడా లేదని అన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి తెగల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తూ వస్తున్నాయని అన్నారు.తెలంగాణలోని ఆదివాసీ తొమ్మిది తెగల ప్రజలు, రాయి సెంటర్స్ సార్ మేడిలు, పటేల్ వ్యవస్థ, యువత, విద్యార్థులు, కార్మిక కర్షక వర్గాల ప్రజలు, మహిళలు, ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు, ఆదివాసీ హక్కుల కోసం పోరాడే ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి డిసెంబర్ 9న మానుకోటలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గోడం గణేష్, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు, కొడప సోనేరావు, కోలం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వెట్టి మనోజ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, అర్కా శేషారావు, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి, కుంర రాజు, కోలాం సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆత్రం గణపతి, డివిజన్ అధ్యక్షులు, గేడం రాము, తుడుం దెబ్బ నాయకులు, మడవి కిషన్, సీనియర్ నాయకులు, తొడసం ప్రకాష్, మడావి డిగాంబర్, తోడసం ప్రకాస్, గోవింద్ రావు, అత్రం భగవంతురావు, ఆత్రం తుకారం, పెందుర్ దిలీప్, యువజన సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమృత్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

• ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి రిజర్వాయర్ల నిర్మాణంలో మరింత వేగం పెంచాలి.. అదనపు కార్మికులను నియమించాలి



(ఆదిలాబాద్ ప్రతినిధి, సాక్షర) ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నిరంతర తాగునీటి సరఫరా కల్పించేందుకు అమృత్ పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డికి పలువురు చైర్మన్లు, కౌన్సిలర్లు పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యలు, అమృత్ పథకం పనుల పురోగతిపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమృత్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా పనుల వివరాలను సలహాదారుకు వివరించారు. ఇందులో భాగంగా పట్టణంలో సుమారు 80 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ పనులు పూర్తికావస్తున్నాయని, 9 వేల గృహాలకు సర్వీస్ కనెక్షన్లు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అలాగే పట్టణంలో మొత్తం 9 ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఇటీవల నాలుగు రిజర్వాయర్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. మిగిలిన ఐదు రిజర్వాయర్ల పనులను కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.అదేవిధంగా పట్టణ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టనున్న మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.పనుల పురోగతిపై సమీక్షించిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, కాంట్రాక్టర్లకు నిధుల కొరత లేకుండా బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ రిజర్వాయర్ల నిర్మాణ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నామమాత్రంగా కొనసాగించడం కాకుండా, అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించి నిర్మాణ వేగాన్ని పెంచాలని ఆదేశించారు.ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పైప్‌లైన్ పనులు, సర్వీస్ కనెక్షన్లు, రిజర్వాయర్ల నిర్మాణం, ఎస్టీపీ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి, నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. అమృత్ పథకం పనులు పూర్తయితే ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరాతో పాటు మురుగునీటి నిర్వహణ వ్యవస్థ కూడా అందుబాటులోకి వస్తుందని పేర్కొంటూ, ఈ పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ప్రభుత్వ సలహాదారు ఆదేశించారు.

అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు



(ఆదిలాబాద్‌టౌన్, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, జాయింట్ కలెక్టర్ చిత్రుతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపుల నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్ రావు, డీఆర్డీఏ పీడీ రవీందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్,సర్పంచులు ధర్మపురి చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి: మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్



(చెన్నూర్, సాక్షర) నిల్వాయి మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ శనివారం మంచిర్యాల జోన్ పరిధిలోని నీల్వాయి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు,కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, నీల్వాయి పోలీస్ స్టేషన్ రాష్ట్ర సరిహద్దులోని మారుమూల ప్రాంతంలో ఉండటంతో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రాష్ట్ర సరిహద్దుల గుండా జరిగే అక్రమ రవాణా,ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు,ట్రబుల్ మంగర్స్‌తో పాటు గతంలో వివిధ నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలను నిరంతరం గమనిస్తూ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో వారి నివాసాలను తరచూ ఆకస్మికంగా తనిఖీ చేస్తూ,ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని,ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ,విధుల్లో క్రమశిక్షణ, పారదర్శకత, బాధ్యతాయుతమైన పనితీరును కనబరచాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ,ఎస్ఐ నాగరాజు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరానగర్ పేద వృద్ధులకు అల్పాహారం..



(రెబ్బెన,సాక్షర): సంజీవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పేద వృద్ధులకు అల్పాహారాన్ని శనివారం సీనియర్ నాయకుడు బొమ్మినేని సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా సంజీవని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు దీకొండ సంజయ్ కుమార్ తోపాటు బొమ్మినేని సత్యనారాయణ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో ఎంతో మానసిక ఆనందం ఉంటుందని ప్రతి ఒక్కరు సేవ చేసే గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు.ప్రతిరోజు వృద్ధులకు రెండు పూటలా అన్నదానం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సభ్యులు రాజు,మహేందర్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

• విట్టల్ రుక్మిణీ కళ్యాణోత్సవాల్లో మాజీ మంత్రి జోగు రామన్న



(జైనథ్, సాక్షర) ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. మండలంలోని లెకర్ వడ గ్రామంలో నిర్వహించిన విట్టల్ రుక్మిణీ కళ్యాణోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విట్టల్, రుక్మిణీ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విట్టల్ రుక్మిణీ దేవతల చరిత్ర, వారి ఆధ్యాత్మిక ప్రాశస్త్యం భక్తిభావాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి, ఆధ్యాత్మిక భావనలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరిగేలా శ్రీకాంత్, ఉస్కెమ్ యాదవ్, హరి, సుకెందర్, చంద్రయ్యా, సాయి, భోజన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు ఓఎస్డీ పేరుతో భారీ మోసం..

• ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో రూ.50 లక్షలు కాజేసిన కేటుగాడు!

(హైదరాబాద్, సాక్షర): తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఓఎస్డీ గా చలామణి అవుతూ జాబ్ కోసం చూస్తున్న నిరుద్యోగులను మోసం చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. మంత్రి ఓఎస్డీగా అవతారమెత్తిన కొలుగూరి రవికిరణ్ అనే చీటర్, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగుల నుంచి ఏకంగా రూ.50.87 లక్షలు కాజేశాడు. ఈ వ్యవహారంపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నకిలీ ఓఎస్డీ ఐడీ కార్డులు, నకిలీ ప్రభుత్వ నియామక ఉత్తర్వులను సృష్టించి నిందితుడు నిరుద్యోగులను, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులను బురిడీ కొట్టించాడు. అంతేకాకుండా, అసలైన ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన నకిలీ పోర్టల్స్‌ను రూపొందించి నిరుద్యోగులకు పూర్తి నమ్మకం కలిగించాడు. టీచర్, మున్సిపల్ అటెండర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రికార్డ్ అసిస్టెంట్ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మొత్తం నలుగురు బాధితుల నుంచి రూ.50.87 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు.మోసపోయిన బాధితులు నేరుగా మంత్రి కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఈ భారీ మోసం బట్టబయలైంది. నిందితుడు సృష్టించిన నకిలీ వెబ్‌సైట్లు, డిజిటల్ ఆధారాలు, బ్యాంకు లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని అధికారులు పోలీసులను కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2016 కు పెంచి పేద ప్రజలకు ఆసరాగా నిలిచిన ఘనత కేసీఆర్‌దే



(బజార్‌హత్నూర్, సాక్షర): గత 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కేవలం రూ.200 పెన్షన్ అందించేదని, దాన్ని రూ.2016 కు పెంచి పేద ప్రజలకు ఆసరాగా నిలిచిన ఘనత కేసీఆర్ దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు.మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గత 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కేవలం రూ.200 పెన్షన్ అందించేదని, దాన్ని రూ.2016 కు పెంచి పేద ప్రజలకు ఆసరాగా నిలిచిన ఘనత కేసీఆర్ దని అన్నారు. 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సైతం హాజరై నవంబర్ లో పెన్షన్ 2000 వస్తది, డిసెంబర్ లో కాంగ్రెస్ ప్రభుత్వం 4000 ఇస్తది అని ప్రచారం చేసి, మూడేళ్లు గడిచిన తర్వాత కేసీఆర్ అందించిన 2016 మాత్రమే అందిస్తూ ప్రజలను మోసం చేసిందన్నారు. అదేవిధంగా మహిళల అభివృద్ధి ప్రభుత్వం అన్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఎందుకు పెన్షన్ అందించలేదన్నారు. మహిళలకు ప్రతీ నెల 2500 ఇస్తామని మోసం, స్కూటీ ఇస్తామని మోసం, అందరిని నమ్మించి అధికారం చేపట్టి మండల మొత్తంలో కేవలం 500 పెన్షన్లు అందించి గొప్ప ప్రచారం చేయడమే తప్ప వేరేది ఏది లేదని మండిపడ్డారు.బీడి కార్మికులకు, వృద్ధులకు సైతం పెన్షన్ అందించాలని, మహిళలను అభివృద్ధి చేసే ప్రభుత్వం అయితే బీడి కార్మికులకు పెన్షన్ ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. ఎన్నికల హామీల్లో 4000 పెన్షన్ ఇస్తానని ప్రజలకు మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.ప్లకార్డులు, ప్రచారాలు మానేసి బీడీ పెన్షన్లు, వృద్ధుల పెన్షన్లు తక్షణమే అందించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, రాజకీయ పార్టీ నాయకులు, గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా పథకం ...ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

- జిల్లా కలెక్టర్ కె.హరిత



(ఆసిఫాబాద్ ప్రతినిధి, సాక్షర) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హత గల ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మీ, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్ పర్సన్లు మెంగ్రే ఆకాష్, సహిన్ సుల్తానా, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, అసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.అహ్మద్ లతో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించే విధంగా 5 లక్షల రూపాయల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 65 వేల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామపంచాయతీలలోని 411 ప్రదేశాలలో శిబిరాలు నిర్వహించి, ప్రతి ఒక్కరి నుండి భీమా దరఖాస్తులు స్వీకరించి వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులు లేని వారికి త్వరలో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఎలాంటి ప్రీమియం చెల్లించకుండా, ఎలాంటి ధృవపత్రాలు అవసరం లేకుండా కేవలం రేషన్ కార్డు నెంబరు ఉంటే కుటుంబ సభ్యుల సమ్మతితో కుటుంబంలో గల 18 నుండి 59 సంవత్సరాల వయసు గల వారిలో ఒకరికి బీమా చేయించుకుని, నామిని వివరాలను దరఖాస్తులో నింపితే సరిపోతుందని తెలిపారు. జిల్లాలో ఈ పథకంపై ప్రజలందరికీ తెలిసే విధంగా టామ్ టామ్, గోడ ప్రతులు, కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నినదించిన గరీబీ హటావో కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి వర్తించేలా సామాజిక భద్రత, ఆర్థిక భరోసా అందించాలనే ఆలోచనతో ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రభుత్వం ప్రారంభించే ప్రతి పథకంలో మహిళలకు పెద్దపీట వేస్తుందని, జిల్లా ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రతి అర్హత కుటుంబానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తులు స్వీకరించే శిబిరాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించి, పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాలు 100 శాతం అర్హులైన లబ్ధిదారులకు అందిన అధికారులకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కినా మారని అవినీతి తిమింగలాలు!

పట్టుబడుతున్నది లంచగొండి అధికారి మాత్రమేనా? అవినీతి వ్యవస్థకు సంకెళ్లు పడేదెప్పుడు...? లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నారు.. కేసులు నమోదవుతున్నాయి.. సస్పెన్షన్లు ఎదుర్కొం టున్నారు.. అయినా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల దందా ఎందుకు కొనసాగుతోంది? ఏసీబీ దాడులు వార్తలకే పరిమితమవుతున్నాయా? శిక్ష పడుతుందనే భయం లేనంతకాలం అవినీతికి అంతం సాధ్యమేనా?ప్రతిరోజూ పత్రికల్లో కనిపించే కొన్ని వార్తలు మనల్ని ఆలోచింపజేస్తున్నాయి. ఒకచోట తహశీల్దార్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.. మరోచోట పోలీసు అధికారి బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.. ఇంకోచోట చిన్న ఉద్యోగి ఫైలు కదలాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ వేధిస్తూ పట్టుబడ్డారు. రూ.10 వేలు, రూ.50 వేలు, లక్ష రూపాయలు.. ఇలా ఏసీబీ అధికారులు నగదును స్వాధీనం చేసుకుంటున్నారు.ఫొటోలు వస్తున్నాయి.. వార్తలు ప్రచురితమవుతున్నాయి.. అధికారులు పట్టుబడుతున్నారని ప్రజలు సంతోషిస్తున్నారు. కానీ కొన్ని రోజుల తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికొస్తోంది. అదే కార్యాలయం.. అదే ఫైళ్ల జాప్యం.. అదే లంచాల డిమాండ్!అసలు ప్రశ్న ఏమిటంటే.. ఏసీబీ అధికారులు అవినీతిపరులను పట్టుకోలేకపోతున్నారా? లేక పట్టుబడిన తర్వాత కూడా అవినీతి మళ్లీ పుట్టుకొచ్చే వ్యవస్థను మనం మార్చలేకపోతున్నామా..

➤ శిక్ష పడుతుందనే భయం ఎక్కడ?

అవినీతికి ప్రధాన కారణాల్లో ఒకటి శిక్ష పట్ల భయం లేకపోవడం. లంచం తీసుకుంటూ పట్టుబడినంత మాత్రాన నేరం నిరూపితమైనట్లు కాదు. చట్టపరమైన విచారణ, సాక్ష్యాలు, న్యాయస్థానంలో నేర నిర్ధారణ అవసరం. అయితే ఈ ప్రక్రియలు సంవత్సరాల తరబడి సాగితే ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుంది. కేసులు త్వరగా పరిష్కారం కాకపోవడం, శాఖాపరమైన చర్యలు ఆలస్యం కావడం, విచారణలో జాప్యం జరగడం వంటి పరిణామాలు అవినీతిపరులకు పరోక్షంగా ధైర్యాన్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. అందుకే ఏసీబీకి చిక్కడం ఒక వార్తగా మిగిలిపోకూడదు. నేరం రుజువైతే చట్టప్రకారం కఠినమైన శిక్ష పడాలి. అప్పుడే మిగతా అధికారుల్లోనూ భయం, బాధ్యత ఏర్పడతాయి.

➤ జీతం కోసం ఉద్యోగమా? అక్రమ సంపాదన కోసం అధికారమా?

ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రజలకు సేవ చేయడానికి లభించిన అవకాశం. కానీ కొందరు ఆ అధికారాన్ని వ్యక్తిగత సంపాదనకు మార్గంగా మార్చుకుంటున్నారు. ప్రభుత్వం జీతం ఇస్తోంది.. ఇతర సదుపాయాలు కల్పిస్తోంది.. ఉద్యోగ భద్రత కల్పిస్తోంది. అయినా అక్రమ సంపాదనపై ఎందుకంత మక్కువ? ఇల్లు, కారు, ఆస్తులు, విలాసవంతమైన జీవితం.. ఇవన్నీ కావాలనే ఆశలో కొందరు తమ బాధ్యతను మరిచిపోతున్నారు. సంపాదనకు హద్దులు ఉండాలి. కానీ ఆశకు హద్దులు లేకపోతే ప్రజాసేవ కూడా వ్యాపారంగా మారిపోతుంది. ప్రజల సమస్యను పరిష్కరించాల్సిన కుర్చీలో కూర్చొని.. అదే ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం ఎంతటి దుర్మార్గం..

➤ లంచం ఇచ్చేవారూ ఆత్మపరిశీలన చేసుకోవాలి!

అవినీతి గురించి మాట్లాడేటప్పుడు లంచం తీసుకునేవారినే కాదు, ఇచ్చేవారిని కూడా ప్రశ్నించాలి. పని త్వరగా కావాలని, నిబంధనలు పక్కన పెట్టాలని, అర్హత లేకున్నా ప్రయోజనం పొందాలని కొందరు స్వచ్ఛందంగా లంచం ఇస్తున్నారు. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తించాలి. బలవంతంగా లంచం చెల్లించే బాధితుడిని, అక్రమ ప్రయోజనం కోసం లంచం ఇచ్చే వ్యక్తిని ఒకే గాటన కట్టలేం. లంచం డిమాండ్ చేసినప్పుడు భయపడకుండా ఫిర్యాదు చేసే ధైర్యం ప్రజల్లో పెరగాలి. బాధితులకు రక్షణ కల్పించాలి. ఏసీబీని ఆశ్రయించే విధానం సులభంగా, నమ్మకంగా ఉండాలి. లంచం ఇవ్వడం సమస్యకు పరిష్కారం కాదు.. లంచం అడిగేవారిని ప్రశ్నించడం పౌరుడి హక్కు! అవినీతికి మరో ముఖం.. అధికారుల చుట్టూ తిరిగే వ్యవస్థ! ప్రతి చిన్న పనికీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు? ఒక సర్టిఫికెట్ కోసం రోజుల తరబడి ఎదురుచూడాలా? ఒక ఫైలు కదలాలంటే మధ్యవర్తిని ఆశ్రయించాలా? ఒక ప్రభుత్వ పథకం లబ్ధి పొందాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సిందేనా? ప్రజలకు సేవలు అందించే వ్యవస్థలో పారదర్శకత లేకపోవడమే అవినీతికి అవకాశం కల్పిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తులు, నిర్ణీత గడువులో సేవలు, ఫైళ్ల కదలికపై డిజిటల్ పర్యవేక్షణ, ప్రతి దరఖాస్తుకు ట్రాకింగ్ నంబర్, ఆలస్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు ఉంటే లంచం అడిగే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, పౌర సేవలపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి కావాలి.

➤ అవినీతిని అరికట్టాలంటే మారాల్సింది ఏమిటి?

త్వరిత విచారణ: ఏసీబీ కేసుల దర్యాప్తు, న్యాయ విచారణ వేగంగా జరిగేలా ప్రత్యేక వ్యవస్థను బలోపేతం చేయాలి. చట్టపరమైన గడువుల్లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి.కఠినమైన శాఖాపరమైన చర్యలు: ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై నిబంధనల ప్రకారం పారదర్శక చర్యలు తీసుకోవాలి. నేరం రుజువైతే ఉద్యోగం, పెన్షన్ తదితర అంశాల్లో చట్టప్రకారం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. అక్రమ ఆస్తులపై నిఘా: ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో సమగ్ర దర్యాప్తు జరిపి, న్యాయస్థానాల ఆదేశాల మేరకు అక్రమ ఆస్తులను జప్తు చేయాలి. డిజిటల్ పాలన: ప్రభుత్వ సేవలను సాధ్యమైనంతవరకు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలి. ఫైళ్లను ఉద్దేశపూర్వకంగా నిలిపివేసే అధికారులపై బాధ్యత నిర్ధారించాలి. ప్రజలకు రక్షణ: లంచం డిమాండ్‌పై ఫిర్యాదు చేసినవారికి భద్రత కల్పించాలి. ఫిర్యాదుదారులను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజా పర్యవేక్షణ: ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సేవల గడువు, సంబంధిత అధికారి వివరాలు, ఫిర్యాదు నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలి. ఏసీబీ దాడులు పెరగడం విజయమా? అవినీతి తగ్గడమే అసలైన విజయమా? ఏసీబీ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయం. వారి దాడులు అవినీతిపరుల్లో భయాన్ని కలిగిస్తున్నాయి. కానీ ఒక ప్రశ్నకు సమాధానం రావాలి. ఒకే శాఖలో పదేపదే లంచం కేసులు నమోదవుతుంటే ఆ శాఖలో వ్యవస్థాగత మార్పులు ఎందుకు రావడం లేదు? ఒక అధికారి పట్టుబడితే అతని స్థానంలో మరొకరు వచ్చి అదే పద్ధతిని కొనసాగిస్తే ప్రయోజనం ఏమిటి? వ్యక్తులను పట్టుకోవడంతోపాటు అవినీతికి అవకాశమిస్తున్న విధానాలను కూడా మార్చాలి. ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. అధికారులు బదిలీ అవుతున్నారు.. కానీ సామాన్యుడి నుంచి లంచం వసూలు చేసే పద్ధతి మాత్రం ఎందుకు మారడం లేదు? చివరిగా.. ప్రజల సొమ్ముతో జీతం తీసుకుంటూ ప్రజలనే పీడిస్తారా? ప్రభుత్వ ఉద్యోగం ఎవరికీ వ్యక్తిగత రాజ్యం కాదు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. లంచం తీసుకునే అధికారి ఒక్క వ్యక్తినే మోసం చేయడం లేదు. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాడు. పేదవాడి హక్కును దోచుకుంటున్నాడు. అర్హుడికి అందాల్సిన సేవను అమ్మకానికి పెడుతున్నాడు. అవినీతి నిర్మూలన బాధ్యత ఏసీబీ ఒక్కదానిదే కాదు. ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, ప్రజలు.. అందరూ తమ బాధ్యతను గుర్తించాలి. ఒక లంచగొండి అధికారి పట్టుబడితే అది ఏసీబీ విజయం. అలాంటి అధికారి మళ్లీ పుట్టకుండా వ్యవస్థను మార్చగలిగితేనే అది ప్రజాస్వామ్య విజయం! లంచం తీసుకునే చేయి కంటే.. లంచం అడగడానికి ధైర్యమిచ్చే వ్యవస్థను కూడా ప్రశ్నించాలి. ప్రజాసేవను వ్యాపారంగా మార్చిన మనస్తత్వానికి ముగింపు పలకాలి. దేశానికి రహదారులు, భవనాలు, ప్రాజెక్టులు ఎంత అవసరమో.. నిజాయితీగల పాలన కూడా అంతే అవసరం. అవినీతి లేని సమాజం కల కాదు.. కఠినమైన చట్టాలు, వేగవంతమైన న్యాయం, ప్రజల చైతన్యంతో సాధించగల లక్ష్యం! మరి చెప్పండి.. ఏసీబీకి చిక్కిన లంచగొండి అధికారి మారాలా? లేక అవినీతికి అవకాశం కల్పిస్తున్న వ్యవస్థే మారాలా?



వ్యాసకర్త: ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్,
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9440287170

ఇందిరమ్మ జీవిత బీమా దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



(ఉట్నూర్, సాక్షర): అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు.ఉట్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం దరఖాస్తుల ప్రక్రియను నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరిశీలించారు.ఈ సందర్భంగా దరఖాస్తుల నమోదు ప్రక్రియను, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్ రోహిదాస్ నియామకం



(సాత్నాల, సాక్షర): ఆదిలాబాద్ జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడిగా సాత్నాల మండలం సైద్‌పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాథోడ్ రోహిదాస్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన అధ్యక్షుడు రాంబాబు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నూతనంగా నియమితులైన రాథోడ్ రోహిదాస్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏండ్రాల నాగేష్, అస్తక్ సుభాష్, కొలం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ రావు, డౌన సర్పంచ్ వినోద్, రాథోడ్ సుధాకర్, రాథోడ్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపదను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

(పెద్దపల్లి, సాక్షర) మానవాళి మనుగడకు అత్యంత ప్రయోజనకరంగా ఉండే మత్స్య సంపదను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ కూడలి వద్ద మత్స్యకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ జెండాను మన ముదిరాజ్ మహిళా రాష్ట్ర నాయకురాలు, టిఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు, బీసీ సంఘాల జేఏసీ నాయకురాలు సిరవేన స్వప్న నాగరాజు, ముదిరాజ్ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, ప్రగతి మత్స్యకార సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా పాల్గొన్న మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు, టిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు శిరవేన స్వప్న నాగరాజు ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గంలో అత్యధికంగా ఉన్న ముదిరాజులు సాంప్రదాయ బద్ధంగా 1964 నుండే మత్స్యకార వృత్తిలో ఉన్నప్పటికీ ఇదే వృత్తిలో ఉన్న వారిని బీసీఏ లో ఉంచి ముదిరాజులను బీసీ డీ లో ఉంచడం సరి అయింది కాదని అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హయంలో ఇచ్చిన జీవో నెంబర్ 15 యధావిధిగా అమలు చేయాలని శిరవేన స్వప్న నాగరాజు ముదిరాజులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 5062 మత్స్య సహకార సంఘాలు ఉంటే అందులో నాలుగు వేల పైచిలుకు సంఘాలు ముదిరాజ్ మత్స్యకారులవేనని స్పష్టం చేశారు.ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం పెంపొందుతున్న నేపథ్యంలో చెరువులు, కుంటలను చదును చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా మారుస్తున్న నేపథ్యంలో మత్స్యకార సంక్షేమ చట్టాన్ని తీసుకొచ్చి మత్స్యకారులకు చేయూత అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా సమాజంలో సగభాగంగా ఉన్న ముదిరాజు మహిళా మత్స్య కార్మికులకు ప్రత్యేకంగా ప్రోత్సాహాన్ని ఇచ్చేందుకు మత్స్య సహకార సంఘాలను, మార్కెట్ సొసైటీలను విరివిగా ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో ఎన్ఎఫ్‌డిపి తో పాటు రాష్ట్ర సమీకృత మత్స్య అభివృద్ధి సంస్థ ద్వారా వాహనాలు అందజేసిన విధంగానే మళ్లీ మత్స్య సహకార సంఘాల సభ్యులకు ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలను అందజేయాలని డిమాండ్ చేశారు.చెరువులు, కుంటల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తూ ఉచిత చేప పిల్లలతో పాటు అవసరం వస్తే చేప పిల్లల స్థానంలో సొసైటీలకు నేరుగా డబ్బులను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారులకు నెలకు పదివేల చొప్పున పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ పోతర వేణి క్రాంతి ముదిరాజ్, ప్రగతి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు నూనె రాజేష్ రాజేశ్వర్ ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సరోజన ముదిరాజ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండు రాజు ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు వీరబోయిన రాజేందర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ ముదిరాజ్, సుంకరి పోతన ముదిరాజ్, మల్లికార్జున్ ముదిరాజ్, మహిళా నాయకురాలు మంథని కార్పొరేటర్ సాగర్ల వాసవి ముదిరాజ్, గడ్డం లక్ష్మీ ముదిరాజ్, నాయకులు కలవేనీ రవి ముదిరాజ్, ప్రగతి మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు కారు పాకల రమేష్ ముదిరాజ్, కలవైన సతీష్ కుమార్ ముదిరాజ్, మౌటం మల్లికార్జున్ ముదిరాజ్, మౌటం శ్రీకాంత్ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, కిరణ్ ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికను గుర్తించి గంట లోపు తల్లిదండ్రులకు అప్పగించిన నిర్మల్ పోలీసులు



(నిర్మల్ ప్రతినిధి, సాక్షర): తప్పిపోయిన బాలికను గుర్తించి గంట లోపు తల్లిదండ్రులకు అప్పగించిన నిర్మల్ పోలీసులు ప్రశంసలు అందుకున్నారు.నిర్మల్ పట్టణంలోని సూఫీనగర్‌లో ఉన్న తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో రాత్రి సుమారు 7:15 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సమయంలో ఐదో తరగతి విద్యార్థి అయిన ఓ బాలిక పాఠశాల ప్రాంగణం నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో పాఠశాల ప్రహరీ గోడ సమీపంలోని పొదలు, మట్టి దిబ్బల వెనుక బాలిక దాక్కుంది.బాలిక కనిపించకపోవడంతో పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై పాఠశాల సిబ్బందితో కలిసి బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు గంట వ్యవధిలోనే బాలికను గుర్తించి క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు.సకాలంలో స్పందించి బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చిన నిర్మల్ పోలీసుల చర్యలను బాలిక తల్లిదండ్రులు, పలువురు అభినందించారు.

బ్యాంక్ పథకాలు, బీమా పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన



(జైనథ్, సాక్షర): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆదిలాబాద్ సిబ్బంది నిర్వహిస్తున్న పొదుపు పథకాలు, డిపాజిట్ పథకాలు, ప్రభుత్వ సామాజిక భద్రత పెన్షన్ పథకాల వివరాలను గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా తెలియజేశారు.శనివారం భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర గిమ్మ బ్రాంచ్ మేనేజర్ గంగుల హరి ప్రసాద్, అవివా మేనేజర్ జి. వినాయక్, అవివా ఏరియా మేనేజర్ ఎం. నిరంజన్, గిమ్మ సర్పంచ్ గాజుల ప్రద్యుమ్న, గిమ్మ వైద్య సిబ్బంది డాక్టర్ సుచల, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆదిలాబాద్ సిబ్బంది నిర్వహిస్తున్న పొదుపు పథకాలను, డిపాజిట్ పథకాలను, ప్రభుత్వ సామాజిక భద్రత పెన్షన్ పథకాలు, అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల శాలరీ ఖాతాల సంబంధించిన వివరాలు, పిఎం జెజెబివై బీమా గూర్చి, పిఎం ఎస్బిఐ బీమా గూర్చి, ఏపివై బీమా గురించి, అలాగే గృహ రుణం, కారు రుణం, బంగారు రుణాలు, వ్యవసాయ రుణాలు, సంబంధిత జీరో అకౌంట్ కు సంబంధించిన వివరాలను గ్రామ ప్రజలకు క్షుణ్ణంగా తెలియ

భారతీయ సినీ రంగంలో సరికొత్త ప్రయోగంగా 'ది లక్ష్మణ – అన్‌టోల్డ్ స్టోరీ'



అత్యాధునిక ఏఐ సాంకేతికతతో ఫోటోరియలిస్టిక్ విజువల్స్, రామాయణంలోని లక్ష్మణుడి వీరగాథను ఆవిష్కరించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'ది లక్ష్మణ – అన్‌టోల్డ్ స్టోరీ'. రామాయణ మహాకావ్యంలో శ్రీరాముడికి అండగా నిలిచి, ఎన్నో సాహసాలు చేసిన మహా యోధుడు, శ్రీరాముని సోదరుడు లక్ష్మణుడి జీవితంలోని వెలుగులోకి రాని విశేషాలను వెండితెరపై ఆవిష్కరించేందుకు 'ది లక్ష్మణ – అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో ఓ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అత్యాధునిక ఏఐ సాంకేతికతను ఉపయోగించి, భారతదేశంలోనే తొలి ఫోటోరియలిస్టిక్ ఏఐ చిత్రంగా ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. సరికొత్త కథనం, అత్యాధునిక సాంకేతికత, అద్భుతమైన విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ చలనచిత్ర నిర్మాణ రంగంలో ఓ కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. రామాయణంలో లక్ష్మణుడి పాత్ర, ఆయన సాహసాలు, త్యాగాలు, వీరత్వాన్ని సరికొత్త కోణంలో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. శ్రీమతి మాతా రాజేశ్వరి సమర్పణలో భూమాత ఆర్ట్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. పి రాధాకృష్ణ కథను అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ మాతా, నితిన్ మాతా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. బియాండ్ ఎక్స్ స్టూడియో, napo.si సంస్థలు ఏఐ సాంకేతిక నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తున్నాయి. ఈ చిత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, తమిళం, మలయాళం భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని భాషల ప్రేక్షకులకు చేరువయ్యేలా భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర అధికారిక పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ తన ఎక్స్ (X) ఖాతా ద్వారా డిజిటల్‌గా విడుదల చేయగా, మల్కాజిగిరి ఎంపీ, కేంద్ర మంత్రి శ్రీ ఈటల రాజేందర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఒక గొప్ప యోధుడి జీవితం, ఇప్పటివరకు పెద్దగా తెలియని ఆయన వీరగాథను అత్యాధునిక ఏఐ సాంకేతికతతో ప్రపంచానికి పరిచయం చేయనున్న 'ది లక్ష్మణ – అన్‌టోల్డ్ స్టోరీ' పై సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంటోంది.

హనుమాన్ 2 – ది రైజ్ ఆఫ్ వానరాస్' మూవీ అనౌన్స్



'హనుమాన్' యూనివర్స్ నుంచి మరో ప్రతిష్టాత్మక ఫాంటసీ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'హనుమాన్' చిత్రాన్ని నిర్మించిన నిర్మాతలు కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి తమ ప్రతిష్టాత్మక ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ఈ కొత్త ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ను'హనుమాన్ 2 – ది రైజ్ ఆఫ్ వానరాస్' పేరుతో మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాలో టాలెంటెడ్ యంగ్ హీరో పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా నటించనున్నారు. ఫాంటసీ కథలను తనదైన శైలిలో తెరకెక్కించే దర్శకుడు వి.ఐ. ఆనంద్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనున్నారు. యంగ్ ఎనర్జీ, భారీ ఫాంటసీ కాన్సెప్ట్ కలయికలో ఈ సినిమా రూపొందనుంది. 'హనుమాన్ 2 – ది రైజ్ ఆఫ్ వానరాస్' కథాంశం ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్న ప్రపంచం, పాత్రల గురించి తెలుసుకోవాలనే క్యూరియాసిటీని టైటిల్ పెంచుతోంది. సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మేఘాల మధ్య నుంచి పైకి వెళ్తున్న ఒక వ్యక్తి, అతని చుట్టూ కనిపిస్తున్న భారీ తోక, హనుమంతుడి దివ్య సాన్నిధ్యం ఈ పోస్టర్‌లో ఆకట్టుకుంటున్నాయి. ఈ విజువల్ సినిమా ఏ స్థాయిలో ఫాంటసీ ప్రపంచాన్ని చూపించబోతోందో తెలియజేస్తోంది. అదే సమయంలో కథలో ఏం ఉండబోతోందనే ఆసక్తిని కూడా పెంచుతోంది. 'హనుమాన్ 2 – ది రైజ్ ఆఫ్ వానరాస్' టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీ మొదలైంది. ఫాంటసీ ప్రపంచంలో మరో కొత్త ప్రయాణానికి ఈ సినిమా శ్రీకారం చుట్టబోతోంది. 'హనుమాన్'తో ఇండియన్ సినిమాలోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్స్‌లో ఒకటిగా నిలిచిన విజయాన్ని అందుకున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, ఇప్పుడు మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులతో తన నిర్మాణ సంస్థ ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తున్న 'SYG', కిచ్చా సుదీప్ నటిస్తున్న 'BRB' చిత్రాలను కూడా ఈ సంస్థ నిర్మిస్తోంది. భారీ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించాలనే లక్ష్యంతో నిర్మాతలు మరో అద్భుతమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మైథాలజీ, అద్భుతమైన సినిమాటిక్ తో కూడిన కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయనున్న గ్రాండ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా 'హనుమాన్ 2 – ది రైజ్ ఆఫ్ వానరాస్' రూపొందనుంది. ఆసక్తికరమైన టైటిల్, పంజా వైష్ణవ్ తేజ్, భారీ క్రియేటివ్ విజన్‌తో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి రాబోతున్న అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టుల్లో ఈ సినిమా ఒకటిగా నిలవనుంది. ఈ సినిమాలో నటించే ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలతో పాటు మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు. నటీనటులు: పంజా వైష్ణవ్ తేజ్

'ఆలోచన' సినిమా మేకింగ్ వీడియో విడుదల



పి.ఎస్.జె. ఫిలిమ్స్ కో బ్యానర్ మీద ప్రదీప్ కుమార్, గుండబోయిన శ్రీనివాస్ నిర్మాణంలో సురేందర్ చాచా తెరకెక్కించిన చిత్రం 'ఆలోచన'. ఈ మూవీలో G.V.నారాయణ రావు, ప్రసాద్ బాబు, నరసింహరాజు, మహర్షి రాఘవ, జయలలిత, రజన్ హరి, బెన్నీ సుధాకర్ వంటి వారు కీలక పాత్రలో, సుజనా,అనుపమ స్వాతి, మాధవి, అద్వైక జెస్సీ, హసిత, జెన్నీ,ప్రసాద్ రామ్, నరేంద్ర, ముఖ్య పాత్రల్లో నటించారు. నవంబర్ 27న 'ఆలోచన' మూవీని గ్రాండ్‌గా రిలీజ్ ప్రపంచవ్యాప్తంగా చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రదీప్ మాట్లాడుతూ... మమ్మల్ని ఆశీర్వదించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఆలోచన మూవీకి 2 ఇయర్స్ నుంచి స్క్రిప్ట్ పైన వర్క్ చేశాము. 27కి రిలీజ్ అవుతుంది. అందరూ థియేటర్‌కి వచ్చి సినిమా చూడాలని కోరుకుంటున్నా అన్నారు. హీరో బెన్నీ మాట్లాడుతూ... నేను మంచి యాక్టర్స్‌తో కలిసి నటించాను. నా అదృష్టం ఇంత మంచి సీనియర్స్‌తో కలిసి నటించడం. నాకు ఇంత మంచి అవాశం ఇచ్చినందుకు దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. హీరోయిన్ జెస్సీ మాట్లాడుతూ... నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు చాలా థ్యాంక్స్. ఆడియన్స్ అందరూ మా సినిమాని సపోర్ట్ చేసి హిట్ చేయాలని కోరుకుంటున్నాను. ఇంత మంది సీనియర్ యాక్టర్స్‌తో కలిసి నటించడం నా అదృష్టం. డైరెక్టర్ చాచా సురేందర్ మాట్లాడుతూ... టీమ్‌లో ఉన్న పెద్దలు. పూజ్యులుగా మిగిలిన నారాయణరావుగారికి అందరికీ కృతజ్ఞతలు. మా డీఓపీ సురేందర్‌రెడ్డి ఒక 2ఎపిసోడ్స్ చేస్తే అక్కడ పరిచయం అయ్యారు. ఆయన నాకు గురువుగారిలాంటి వారు. ఆర్ట్ డైరెక్టర్ గిరీష్ వీరందరూ కూడా నాకు ఫ్రెండ్స్. మ్యూజిక్ డైరెక్టర్ వియాన్ నాకు తమ్ముడు లాంటి వాడు. నేను ప్లాన్ చేసుకున్న ప్రకారం చేయడానికి సహకరించిన నా నిర్మాతలకు చాలా చాలా కృతజ్ఞతలు అన్నారు. నటి మాధవి మాట్లాడుతూ... నాకు ఇంత మంచి గొప్ప అవకాశం ఇచ్చినందుకు దర్శకనిర్మాతలకు చాలా చాలా కృతజ్ఞతలు అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ భరద్వాజ మాట్లాడుతూ... ఈ చిత్రం పిల్లలకు మాత్రమే లాంటి సినిమా. కచ్చితంగా పిల్లలు చూడాల్సిన సినిమా. పిల్లలు తల్లిదండ్రులను నగరాల్లో వదిలేసి విదేశాలకు వెళ్ళడం అనే అంశాన్ని తీయడం మంచిది. ఏది ఏమైనా మంచి సినిమా. మంచు పల్లకి సినిమాకి దీనికి పోలిక కనిపిస్తుంది. ఐదుగురు కుర్రాళ్ల సినిమాగా ఉంటుంది. నెగిటివ్, పాజిటివ్ అంశాన్ని చూపించారు. అందుకు దర్శకుడ్ని అభినందించాలి. మారిన సామాజిక స్థితిగతుల గురించి కూడా చూపించి ఉంటే బావుండేది. ఏది ఏమైనా చాలా మంచి సినిమా తీశారు. ఇంత మంచి సినిమా తీసినందుకు దర్శక నిర్మాతలను అభినందిస్తున్నాను. నటి అనుపమ మాట్లాడుతూ... ముందుగా మా డైరెక్టర్ సురేందర్ చాచా గారికి కృతజ్ఞతలు. ఇంత మంది పెద్దవాళ్ళతో కలిసి నటించడం నా అదృష్టం. నాకు ఇంత మంచి అవకాశం లభించడం నా పూర్వజన్మసుకృతం. కెమెరామెన్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ సినిమా ఆలోచన సురేందర్ చాచా ముందుగ ప్రపోజల్ తీసుకువచ్చారు. నేను ఆ నలుగురు చేసినప్పుడు ఆ సినిమా ఆడుద్దా లేదా అనే డౌట్ ఉండేది. కానీ ఈ నిర్మాతలకు అసలు డౌట్ లేదు. చాచా ఈ సినిమా పెయింటింగ్ లాగా చేద్దాం అన్నారు. అప్పుడు నాకు టఫ్‌గా అనిపించింది. ఈ చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా సపోర్ట్ చేశారు. ఈ కథని అందరూ ఎంతో బాగా నమ్మారు. యాక్టర్స్ ఎంత బాగా ఇన్‌వాల్వ్ అయి చేశారు. అన్నది మూవీ చూస్తే మీకు అర్థమవుతుంది. ఆడియో అనేది సినిమాకి ఎంత అవసరమో ఈ సినిమా చూస్తే అర్థమవుతుంది. చాచా ఈ సినిమా తరువాత అంతా అద్భుతాలే చేస్తారు అని చెప్పవచ్చు. మా చాచా ఆలోచనలు అవి చాలా డిఫరెంట్. మేము కలిసి మరో సినిమా చేయాలనుకుంటున్నాను. సురేష్‌కొండేటి ఎవరికీ అందని అంత ఎత్తుకి ఎదిగిపోయారు. చాలా థ్యాంక్స్ . మా సినిమాని ఇంతలా ప్రోత్సహిస్తున్నందుకు. ఆయన తీసుకునే డెసిషన్స్ చాలా గొప్పగా ఉంటాయి. ఆయన ఆలోచన విధానం చాలా బావుంటుంది. అందుకే ఎవ్వరికీ అందని అంత ఎత్తుకి ఎదిగిపోయారు. సురేష్‌కొండేటి మాట్లాడుతూ... నేను ఇలాంటి సినిమాలు మన ఎస్‌కె పిక్చర్స్ ద్వారా రిలీజ్ చేశాం. ఈసినిమా చాలా అద్భుతమైన సినిమా.అందరూ థియేటర్‌కి వచ్చి సినిమా చూడాలని కోరుకుంటున్నా. ఇక సినిమా టికెట్ రేట్ కేవలం 100 రూపాయలకి మాత్రమే పెట్టడం జరిగింది. 60ఏళ్ళు వచ్చిన సీనియర్స్ ఎవరైనా థియేటర్స్ వద్దకి వచ్చి ఆధార్ కార్డు చూపిస్తే సినిమా ఫ్రీగా చూడవచ్చు. చాలా అద్భుతంగా ఈ సినిమా సీనియర్ సిటిజన్స్ అందరూ వచ్చి చూడొచ్చు. పెద్దవాళ్ళు ఏదో ఒక సన్నివేశంలో కనెక్ట్ అవుతారు. ప్రతీ యువత కూడా చూడాలి వారు వయసు మళ్ళిన తరువాత వారి లైఫ్ కూడా ఇంతే అని తెలుసుకుంటారు. ఈ ఆధారకార్డు 3 రోజులు పెట్టడం జరిగింది. నటుడు హరి మాట్లాడుతూ... నేను రాజమండ్రి నుంచి వచ్చాను. లేటు అయింది అందరికీ క్షమాపణలు. ముఖ్యంగా నా ప్రయత్నం లేకుండా ఏదైనా ఒక పాత్ర వస్తే ఆ పాత్ర నాకు మంచి గుర్తింపు తీసుకువస్తుంది. ఇంత గొప్ప నటులతో చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇంత సీనియర్స్‌తో కలిసి చేయడం తో నేను క్రమశిక్షణ అనేది నేర్చుకున్నాను. ఈ సినిమాలో చాలా మంచి లెంగ్త్ ఉన్న క్యారెక్టర్. ఇంత లెంగ్త్ ఉన్న క్యారెక్టర్ ఎప్పుడూ రాలేదు. ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు నా కృతజ్ఞతలు. ముఖ్యంగా క్లైమాక్స్ చిత్రీకరణ చాలా అద్భుతంగా వచ్చింది. ఎమోషనల్ సీన్స్ సూపర్బ్. సినియర్ నటి జయలలిత మాట్లాడుతూ... మా సినిమా మాకు ముద్దుగా ఉంటుంది. మన బిడ్డలు మనకి ముద్దుగా అన్నట్లు ఉంటుంది. చాచా గారు ఎందుకు ఆ పేరు పెట్టుకున్నారంటే చార్లిచాప్లిన్‌కి ఆయన అభిమాని అందుకే ఆయన పేరు పెట్టుకున్నారు. నేను ఏ పాత్ర చేసినా చాలా ఎక్స్‌పెక్టెడ్‌గా చేస్తాను. కానీ ఈ సినిమా ఏ ఎక్స్పెక్టేషన్ లేకుండా ఈ సినిమా చేశాను. కానీ సినిమా చాలా బాగా వచ్చింది. సహకరిస్తున్న కాట్రగడ్డ ప్రసాద్ గారికి కృతజ్ఞతలు .మా బంగారం సురేష్ కొండేటి ఈ సినిమాని ఇంత ముందుకు తీసుకువెళుతున్నందుకు ఆయనకు పాదాభివందనాలు అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మాట్లాడుతూ... సంతోషం సురేష్‌కొండేటిగారికి కృతజ్ఞతలు. సినిమాని ఎంతో బాగా ముందుకు తీసుకువెళుతున్నాను. నేను ఈ సినిమా గురించి ఒక పాటలో చెపుతాను. ఆ పాట రాసిన ప్రతాప్ రాజులపల్లి గారికి కృతజ్ఞతలు. నాకు ఈ సినిమాకి మ్యూజిక్ ఇచ్చే అదృష్టం దక్కింది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు చాచా అన్నకి చాలా థ్యాంక్స్ నటుడు ప్రసాద్‌రావు మాట్లాడుతూ... చాచాగారునాకు మంచి పాత్ర ఇచ్చారు. తెర వెనుక నేను ఎడిటర్‌గా పనిచేశాను. నేను తెర మీద ఎడిట్ చేస్తూ వాళ్ళతో కలిసి నటించడం చాలా అదృష్టం. నాకు ఇంత మంచి అవకాశం కల్పించిన వారందరికీ చాలా థ్యాంక్స్ అన్నారు. మ్యూజిక్ మాధవ్ మాట్లాడుతూ... భజగోవిందం లాంటి సాంగ్ ఉన్న సినిమా సూపర్బ్. లెజండరీ యాక్టర్స్‌తో ఈ సినిమా చేయడం ఆనందం. నటుడు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ... పెద్దలందరికీ నమస్కారం. మేము ముగ్గురం షూటింగ్ చేసేటప్పుడు. మాకు వయసులు అయిపోయినా కూడా ఇప్పటి యువతరంతో కలిసి నటించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఈ సినిమాలో మేము ఎక్కడా కనిపించం మా పాత్రలే కనిపిస్తాయి. మా సినిమాటోగ్రాఫర్ చాలా బాగా తీశారు. గిరి ఆర్ట్‌డైరెక్టర్ ఎంతో అద్భుతంగా చేశారు. ఈ సినిమాకి పని చేసిన ప్రతి ఒక్కరికి చాలా థ్యాంక్స్. ఈ సినిమా కాలేజీల్లో. స్కూళ్లలో చూపించమనడం చాలా థ్యాంక్స్ 27 దయచేసి థియేటర్లలో సినిమాని చూడండి. అందరికీ థ్యాంక్స్ నటుడు నర్సింహరాజు మాట్లాడుతూ.. ఈ సినిమాలో నేను నటించడానికి జీ.వి. నారాయణరావు కారణము. ఆయన నాకు స్నేహితుడు. ఆయనకు ఈ కథ చాలా ఇష్టం. ఆయన లేకుండా ఈ సినిమా రిలీజ్ అవ్వడం చాలా బాధగా ఉంది. ఎన్నో సినిమాలు చేసినా కొన్ని విడుదల కూడా అవ్వవు. అయితే డైలాగులు, టేకింగ్, ఆర్టిస్టులు, సురేందర్, సురేందర్ రెడ్డి వీరందరినీ చూసిన తరువాత నా ఆలోచన తప్పు వీరి ఆలోచనే కరెక్ట్ అనుకున్నా. చాలా బాగా అద్భుతంగా తీశారు. ఈ సినిమాకి సురేష్‌కొండేటి చేయడంతో దీనికి ఎంతో కళ వచ్చింది. అందరికీ ధన్యవాదాలు. నటీనటులు : G.V నారాయణ రావు, ప్రసాద్ బాబు, నరసింహరాజు, మహర్షి రాఘవ, జయలలిత, రజన్ హరి, బెన్నీ సుధాకర్ తదితరులు

అల్లు అర్హకు అల్లు అర్జున్ స్పెషల్ విషెస్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటారు అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సినిమా అప్డేట్లతో పాటుగా తన ఫ్యామిలీతో గడిపే ఆనంద క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. అల్లు అర్హ, అల్లు అయాన్, అల్లు స్నేహా రెడ్డికి సంబంధించిన విషయాల్ని అల్లు అర్జున్ షేర్ చేస్తూ ఉంటారు. ప్రస్తుతం అల్లు వారి పరివారం అంతా కూడా శ్రీలంకలో సందడి చేస్తోంది. అల్లు అర్హ పదో పుట్టిన రోజు సందర్భంగా అల్లు సపరివారమంతా శ్రీలంకలో బర్త్ డేని గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కుమార్తె అల్లు అర్హ 10వ పుట్టినరోజు సందర్భంగా ఒక హృదయపూర్వక పోస్ట్‌ను షేర్ చేశారు. నా ఈ జీవితపు సంతోషం, ఆనందం (Joy of My Life) అని పేర్కొంటూ అర్హపై తనకున్న ప్రేమను చాటుకున్నారు తండ్రీకూతుళ్ల మధ్య ఉండే గొప్ప అనుబంధాన్ని ప్రతిబింబించే ఒక అందమైన బ్లాక్ అండ్ వైట్ ఫోటోను షేర్ చేస్తూ "హ్యాపీ బర్త్ డే టు జాయ్ ఆఫ్ మై లైఫ్' అని పోస్ట్ వేశారు. అల్లు అర్జున్ అటు సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా కూడా వ్యక్తిగత జీవితంలో కూడా తన కుటుంబానికి అంతే సమయాన్ని ఇస్తుంటారు. కుటుంబంతో గడిపే మధుర క్షణాలను తరచుగా అభిమానులతో ఆయన పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆయన చేసిన ఈ బర్త్ డే పోస్ట్ అర్హతో ఉన్న ప్రత్యేక అనుబంధానికి మరో చక్కని నిదర్శనం. గుణశేఖర్ దర్శకత్వంలో వచ్చిన 'శాకుంతలం' చిత్రంతో అర్హ బాలనటిగా వెండితెరపై అరంగేట్రం చేశారు. కేవలం ఐదేళ్ల వయసులోనే 'ప్రపంచంలోనే అతి చిన్న చెస్ శిక్షకురాలుగా అల్లు అర్హ నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా గుర్తింపు పొందింది. అర్హలో తెలుగులో మాట్లాడే ముద్దు ముద్దు మాటలు, అనర్గళంగా చెప్పే పద్యాలు అందరి దృష్టిని ఆకర్షిస్తుంటాయన్న సంగతి తెలిసిందే.

'రాయవలస' మూవీలో 'నీతో ఓ అడుగు' పాటకు మంచి స్పందన



రేసన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై గోపి కృష్ణ జయంతి నిర్మాణంలో రాధిక జయంతి తెరకెక్కించిన చిత్రం 'రాయవలస'. ఈ మూవీలో కార్తీక్, శ్రీష నులు జంటగా నటించారు. కార్తీక్ హీరోగా, రచయితగా, సింగర్‌గా ఈ సినిమాతో తనలోని మల్టీ టాలెంట్‌ను చూపించబోతోన్నారు. ఇప్పటి వరకు వదిలిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్ అన్నీ కూడా ఆడియెన్స్‌ని ఆకట్టుకున్నాయి. అయితే తాజాగా వదిలిన ప్రేమ గీతం యూట్యూబ్‌లో చార్ట్ బస్టర్‌గా నిలిచింది. 'నీతో ఓ అడుగు' అంటూ సాగే ఈ పాటకు హీరో కార్తీక్ స్వయంగా సాహిత్యం అందించడమే కాకుండా, తన గాత్రంతో ఆలపించడం విశేషం. నటన, పాటల రచన, గానం వంటి విభిన్న కళల్లో ప్రతిభ చూపించే హీరోలు సినీ పరిశ్రమలో అరుదుగానే కనిపిస్తుంటారు. అలాంటి బహుముఖ ప్రతిభతో కార్తీక్ తన తొలి చిత్రంతోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రముఖ గాయని రమ్య బెహరా తన మధురమైన, సున్నితమైన గాత్రంతో పాటకు మరింత ఆకర్షణను తీసుకు వచ్చారు. అర్జున్ బాల అందించిన మెలోడీయస్ ట్యూన్, కార్తీక్-రమ్య బెహరా గాత్రం పాటను చార్ట్ బస్టర్‌గా నిలబెట్టాయి. లిరికల్ వీడియోలో రాధిక జయంతి మేకింగ్, టేకింగ్ కనిపిస్తోంది. ముఖ్యంగా బీచ్ నేపథ్యంలో చిత్రీకరించిన రొమాంటిక్ సన్నివేశాలు, సహజమైన ప్రేమ భావనలు 90ల నాటి మధురమైన ప్రేమ గీతాలను గుర్తుచేస్తున్నాయి. సాధారణంగా సముద్ర తీరంలో చిత్రీకరించిన ప్రేమ గీతాలు ఎప్పుడూ ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తుంటాయి. సినిమాటోగ్రాఫర్ కిట్టు తన అద్భుతమైన కెమెరా పనితనంతో ప్రతి ఫ్రేమ్‌ను ఒక అందమైన చిత్రంలా తీర్చిదిద్దారు. రాజ్ పైడే అందించిన సున్నితమైన కొరియోగ్రఫీ, హీరో హీరోయిన్ల మధ్య అందమైన రొమాంటిక్ మూమెంట్స్ పాటలోని ప్రేమ భావనను మరింత పెంచాయి. 'రాయవలస' పాటలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'రింగుడు రింగుడు', 'జాతర' పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు వాటికి పూర్తి భిన్నంగా ఒక క్లాసీ రొమాంటిక్ మెలోడీతో చిత్రబృందం ముందుకొచ్చింది. తాజాగా విడుదలైన ఈ ప్రేమ గీతానికి కూడా మంచి స్పందన లభిస్తోంది. పల్లెటూరి నేపథ్యంలో ప్రేమ, స్నేహం, కుటుంబ బంధాలు, భావోద్వేగాల కలయికతో తెరకెక్కుతున్న 'రాయవలస' డిసెంబర్ 11, 2026న థియేటర్లలో విడుదల కానుంది. తొలిసారిగా సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టినప్పటికీ, 'రాయవలస' చిత్రబృందం విడుదలకు ముందే ఒక కీలక మైలురాయిని అందుకుంది. ఆంధ్రా, నైజాం ప్రాంతాలతో పాటు ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ డీల్స్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ముఖ్యంగా ఓవర్సీస్ హక్కులను సినీ గోల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సొంతం చేసుకోవడం విశేషం. తొలి చిత్రంతోనే స్వదేశీ, విదేశీ మార్కెట్లలో డిస్ట్రిబ్యూషన్‌ను ఖరారు చేసుకోవడం నిర్మాత గోపి కృష్ణ జయంతి, దర్శకురాలు రాధిక జయంతి విజన్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. డిసెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న 'రాయవలస'పై చిత్రబృందం పూర్తి నమ్మకంతో ఉంది.

'జనవరి 12 విడుదల' సినిమా నుంచి 'డివికి డివికి' సాంగ్ రిలీజ్



విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్ మోస్ట్ అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల'. హిట్ మెషీన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ అయింది. కలర్‌ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్లు, ఎంటర్‌టైనింగ్ ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'బావ బామ్మర్ది సొజన్యంతో' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకులను అలరించనుంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ ఫస్ట్ సింగిల్ 'డివికి డివికి' ని రిలీజ్ చేశారు. జి.వి. ప్రకాష్ కుమార్ కంపోజ్ చేసిన ''డివికి డివికి'' అమ్మాయిలందరికీ అంకితం చేసిన వైబ్రెంట్ సెలబ్రేషన్ సాంగ్. ఫెస్టివ్ ఎనర్జీ, కలర్‌ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే రిథమ్‌తో ఈ పాట సాగుతుంది. అనంత శ్రీరామ్ అందించిన లిరిక్స్ వదిన, మరదళ్ల మధ్య ఉండే ఆప్యాయత, సరదా సంభాషణలను చాలా అందంగా చూపించాయి. మధు ప్రియ, హరి ప్రియ తమ ఎనర్జిటిక్ వాయిస్‌తో పాటకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. బృంద మాస్టర్ కొరియోగ్రఫీ ఈ పాటకు మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డాన్స్ సీక్వెన్స్‌లను చాలా ఎంగేజింగ్‌గా, విజువల్‌గా ఆకట్టుకునేలా రూపొందించారు. కీర్తి సురేష్, కృతి శెట్టి తమ ట్రెడిషనల్ లుక్స్, చలాకీ ఎక్స్‌ప్రెషన్స్, ఎనర్జీ, గ్రేస్‌ఫుల్ డాన్స్ మూవ్స్‌తో పాటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ, తెరపై కనిపించే ఆప్యాయత పాటను మరింత ఆహ్లాదకరంగా మార్చాయి. వెంకటేష్, కల్యాణ్ రామ్ కూడా ఈ సెలబ్రేషన్స్‌లో జాయిన్ అయి మరింత సందడి చేశారు. ముఖ్యంగా ఈ పాటలోని క్యాచీ హుక్ స్టెప్ సోషల్ మీడియా ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఉంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో ఈ స్టెప్ ట్రెండ్ అయ్యింది. అనిల్ రావిపూడి తన సినిమాల్లో కంపోజర్స్ నుంచి క్యాచీగా, ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అయ్యే మ్యూజికల్ నంబర్స్‌ను తీసుకోవడంలో తన ప్రత్యేకతను మరోసారి చూపించారు. 'డివికి డివికి' ఎనర్జిటిక్ కంపోజిషన్, లైవ్లీ కొరియోగ్రఫీ, కలర్‌ఫుల్ విజువల్ ప్రెజెంటేషన్‌తో ఈ పాట మంచి సెలబ్రేషన్ నంబర్‌గా రూపొందింది. ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు మ్యూజిక్ చార్ట్స్‌లోనూ తనదైన ముద్ర వేసింది. ఈ సినిమాకు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్‌గా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి పండుగ సీజన్‌లో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా జనవరి 12, 2027న థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నటీనటులు:విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, క